www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
02 సెప్టెంబర్ 2023
సంపుటి:1 సంచిక:321

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## ఆదిత్యఎల్ 1' ప్రయోగానికి అంతా సిద్ధం..

- నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ57
- సౌర వాతావరణ పరిశోధనే లక్ష్యం
- సూర్యుడి అధ్యయనానికి ఇస్రో తొలి మిషన్
- లగ్రాంజ్ పాయింట్ 1కు చేరుకునేందుకు 125 రోజుల పాటు ప్రయాణం

2లో



## గాంధీ స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం

**మహాత్ముడి స్ఫూర్తితోనే పథకాలు**

**గాంధీ ప్రేరణతోనే గ్రామాలు బాగు చేస్తున్నాం**

**తెలంగాణ మోడల్ దేశానికి దిక్సూచీ : ముఖ్యమంత్రి కేసీఆర్**

**విశాలభారతి, హైదరాబాద్:**

టీఆర్ఎస్ ను స్థాపించినప్పుడు అహింసాయుత ఉద్యమం ద్వారా రాజ్యాంగ పరిధిలో ఉద్యమించి విజయం సాధిస్తామని నేను నిండు మనసుతో స్పష్టంగా ప్రకటించానని గుర్తు చేసుకున్నారు. మొదట కొందరు నాతో ఏకీభవించలేదని.. రాను.. రాను నేను ఎంచుకున్న మార్గమే సరైందని అంగీకరించి వెంట నడిచారని కేసీఆర్ తెలిపారు. ప్రాణాన్ని పణంగా పెట్టి అయినా సరే లక్ష్యాన్ని సాధించాలి తప్ప అహింసా మార్గాన్ని వీడకూడదని నేను నిర్ణయించుకున్నా. ఆ నేపథ్యంలో నుంచి వచ్చిందే ఆమరణ నిరాహార దీక్ష ఆలోచన. స్వాతంత్ర్య పోరాట కాలంలో బ్రిటీష్ పాలనే బాగుందన్న ప్రబుద్ధుల వంటి వారు తెలంగాణ ఉద్యమ కాలంలోనూ ఉండే వారు. వారు తెలంగాణ వద్దు సమైక్య పాలనే ముద్దు అని నిస్సిగ్గుగా ప్రకటిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చాలా చేశారు. మన చిత్తశుద్ధి ముందు వారి ప్రయత్నాలు విఫలం కాక తప్పలేదు. విచిత్రం ఏంటంటే వాళ్లే ఇవాళ మనకు తెలంగాణ ఉద్యమం గురించి పాఠాలు చెప్పడానికి సిద్ధపడుతున్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో జరిగిన స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు.

తెలంగాణ ఏర్పాటు తర్వాత గ్రామ స్వరాజ్యం, గ్రామ స్వయం పోషకత్వం దిశగా ముందడుగు గ్రామ స్వరాజ్యం, గ్రామ స్వయం పోషకత్వం దిశగా మనం ఎంతో దూరం ప్రయాణించ గలిగాం. గ్రామీణ వృత్తులకు ప్రోత్సాహం ఇవ్వగలిగాం. గ్రామాలు సుసంపన్నంగా మారుతున్నాయి. ప్రజలందరికీ తాగునీరు కూడా ఇంతకాలం ప్రభుత్వాలు ఇవ్వలేకపోయాయి. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. సంక్షేమానికి అగ్ర తాంబూలం ఇవ్వడం లోనూ, రైతు కేంద్రంగా ప్రణాళికల రచన చేయడంలోనూ, గ్రామీణ ఆర్థిక వృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వెనుక గాంధీగారి ప్రభావమే ఉన్నదని తెలిపారు. భారత దేశం ఆత్మ గ్రామాల్లోనే ఉన్నదని గాంధీగారు పదే పదే చెప్పారు. ఆ మాటల ప్రేరణతోనే గ్రామీణ జీవన ప్రమాణాలను అభివృద్ధి చేసుకుంటున్నాం.

..మిగతా |2| లో



## పాలేరుపై ప్లాన్?

## కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర పోటీ

> కాంగ్రెస్ పార్టీలో పాలేరు సీటు గోల్డెన్ సీటులా మారింది. ఈ సీటు కోసం త్వరలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరబోతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, వైఎస్సార్టీపీ అధినేత షర్మిల కన్నేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం ఇదే సీటు కావాలంటున్నారు. మరోవైపు సీపీఎం తమకు కేటాయించాలని కోరుతోంది. ఇక్కడ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ చేయాలని భావిస్తున్నారు. దీంతో ఈ నియోజకవర్గంపైనే ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ టికెట్ ఎవ్వరికివ్వాలో తెలియక కాంగ్రెస్ అధిష్ఠానం తలలు పట్టుకుంటున్నది. డీకే శివకుమార్ ద్వారా షర్మిల ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మీద తుమ్మల తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు పొంగులేటి సైతం తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు.

- రేసులో షర్మిల, తుమ్మల, పొంగులేటి
- తమకే కేటాయించాలంటున్న సీపీఎం
- డీకే శివకుమార్ ద్వారా షర్మిల రాయబారం
- చేరికకు ముందే కండీషన్లు పెడుతున్న షర్మిల, తుమ్మల
- తలలు పట్టుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు
- కూకటపల్లికి తుమ్మలను..
- సికింద్రాబాద్ కు షర్మిలను పంపించాలని యోచన
- ససేమిరా అంటున్న లీడర్లు
- హాట్ సీట్ గా మారిన పాలేరు


**విశాలభారతి, తెలంగాణ బ్యూరో:**

**షర్మిలకు ఏపీకి పంపించాలని ప్లాన్?**

వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిలను ఏపీ రాజకీయాల్లోకి పంపించాలని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రతిపాదించింది. అయితే అందుకు షర్మిల ఒప్పుకోవడం లేదని సమాచారం. పైగా తనకు పాలేరు టికెట్ కావాలని.. అప్పుడే కాంగ్రెస్ పార్టీలో చేరుతానని ఆమె కాంగ్రెస్ పెద్దలకు స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో మధ్యేమార్గంగా ఆమెను సికింద్రాబాద్ సెగ్మెంట్ కు పంపించేందుకు కూడా కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమెను తెలంగాణ కాంగ్రెస్ లోకి రానివ్వకుండా పీసీసీ చీఫ్ రేవంత్ వర్గం తీవ్రంగా అడ్డుకుంటున్నట్టు తెలుస్తోంది. అయితే పొంగులేటి మాత్రం తనకు కాకపోతే షర్మిలకు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నట్టు సమాచారం. మరోవైపు మల్లు భట్టివిక్రమార్క సైతం షర్మిలకు సపోర్ట్ చేస్తున్నారు. రేవంత్ పాలేరు టికెట్ ను తుమ్మలకు ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

**కూకట్ పల్లికి తుమ్మల?**

మరోవైపు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావును కాంగ్రెస్ లో చేర్చుకొని కూకట్ పల్లి సెగ్మెంట్ నుంచి పోటీ చేయించాలని కాంగ్రెస్ లోని ఓ వర్గం చూస్తోంది. కూకట్ పల్లికి తుమ్మలను పంపించడం ద్వారా సెటిలర్ల ఓట్లు, కమ్మ సామాజికవర్గం ఓట్లు తమకు పడతాయని కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. అయితే సొంత జిల్లా ఖమ్మం వదిలిపెట్టి కూకట్ పల్లికి వచ్చేందుకు తుమ్మల సిద్ధంగా లేరు. దీంతో ఆ దిశగా చర్చలు జరుగుతున్నాయి. మొత్తంగా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోని రాజకీయం మొత్తం పాలేరు నియోజకవర్గం చుట్టే తిరుగుతోంది. ఇక్కడ టికెట్ ఎవరికి దక్కుతుందో వేచి చూడాలి.



## దేవగౌడ మనవడికి షాక్

- లోక్ సభ ఎన్నికపై అనర్హత వేటు
- తప్పుడు అఫిడవిట్ సమర్పించడంతో చర్యలు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** మాజీ ప్రధాన మంత్రి, జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) వ్యవస్థాపకుడు హెచ్.డీ దేవెగౌడ మనవడు ప్రజ్వల్

..మిగతా |2| లో

## టీచర్ల బదిలీలకు షెడ్యూల్ విడుదల

2లో

- 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



## తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

- 934 కోట్ల ఇన్వెస్ట్ మెంట్ చేయనున్న కార్నింగ్
- 800 మందికి ప్రత్యక్ష ఉపాధ

**విశాలభారతి, హైదరాబాద్:**

తెలంగాణకు పెట్టుబడుల వరద కొనసాగుతోంది. రాష్ట్రంలో రూ.934 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కార్నింగ్ సంస్థ ముందుకు వచ్చింది. తెలంగాణలో సెల్‌ఫోన్లకు సంబంధించిన గొరిల్లా గ్లాస్ తయారీ పరిశ్రమ పెట్టాలని సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌తో సంస్థ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ పరిశ్రమ వల్ల 800 మందికి ప్రత్యక్ష ఉపాధి దొరుకుతుందన్నారు మంత్రి కేటీఆర్. మెటీరియల్ సైన్సెస్‌లో అగ్రగామిగా ఉన్న కార్నింగ్.. ఇండియాలోనే మొదటి సారిగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్.. పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు. ఈ పర్యటనలో ఇప్పటికే అనేక సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంతో పాటు కంపెనీ కార్యకలాపాల విస్తరణకు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. పెంపుడు జంతువులకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల తయారీలో అంతర్జాతీయంగా పేరుగాంచిన మార్స్ గ్రూప్ రూ.800 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ సంస్థ ఇప్పటికే సిద్దిపేట జిల్లాలో రూ.200 కోట్లతో పెంపుడు జంతువుల ఆహార తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తర్వాత 2021 డిసెంబర్‌లో మరో రూ.500 కోట్లు పెట్టుబడితో సంస్థ కార్యకలాపాలు విస్తరించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఉత్పత్తులకు మంచి స్పందన రావడం, తెలంగాణలో స్నేహ పూర్వక వాతావరణం ఉండటంతో మరో రూ.500 కోట్లతో

..మిగతా |2| లో



## ప్యాకేజ్డ్ ఆహారంతో జీవనశైలిని దెబ్బతీసే వ్యాధులు

**ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం అత్యవసరం**

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్,విశాలభారతి:**

క్యాన్సర్, జీవనశైలిని దెబ్బతీసే వ్యాధులను అరికట్టడానికి మంచి ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం అత్యవసరమని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఈ దిశగా వైద్యనిపుణులు ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్టులో స్వర్ణ భారత్ ట్రస్టు, కేర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ వైద్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, స్వర్ణ భారత్ ట్రస్టు హైదరాబాద్ ఛాప్టర్

..మిగతా |2| లో

## కూటమి బలం చూసి బీజేపీకి గుబులు

- ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా గెలుపు మాదే
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

విపక్ష కూటమి బలం చూసి బీజేపీకి గుబులు పట్టుకున్నదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఒకే దేశంఒకే ఎన్నిక'సాధ్యాసాధ్యాలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేయడం దేశ రాజకీయాలను వేడెక్కించింది. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై విపక్షాలు మండిపడుతున్నాయి. ప్రజల

..మిగతా |2| లో



# ఆదిత్యఎల్ 1' ప్రయోగానికి అంతా సిద్ధం..

**విశాల భారతి, నేషనల్ బ్యూరో:**

జాబిల్లి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా దింపి చరిత్ర సృష్టించిన ఇస్రో ఇప్పుడు సూర్యుడిపై పరిశోధనలకు సిద్ధమైంది. ఆదిత్య ఎల్ 1 ప్రయోగాన్ని శ్రీహరికోటలోని షార్ నుంచి చేపట్టేందుకు సన్నద్ధమైంది. శనివారం ఉదయం 11 గంటల 50 నిమిషాలకు ఆదిత్యఎల్ 1ను పీఎస్ఎల్‌వీసీ57 వాహకనౌక నింగిలోకి మోసుకెళ్లనుంది. సౌర తుపాన్ల వల్ల భూమిపై సమాచార వ్యవస్థలకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఇస్రో చేపట్టిన ఈ పరిశోధన అంతరిక్ష వాతావరణంపై ఓ అంచనాకు వచ్చేందుకు దోహదపడనుంది. సూర్యుడిపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తొలిసారిగా చేపడుతోన్న ఆదిత్య ఎల్ 1 ప్రయోగానికి కౌంట్‌డౌన్ కొనసాగుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో ఈ ప్రయోగానికి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల 10 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 23 గంటల 40 నిమిషాల కౌంట్‌డౌన్ అనంతరం శనివారం ఉదయం 11 గంటల 50 నిమిషాలకు ఆదిత్యఎల్ 1 ఉపగ్రహాన్ని మోసుకుని పీఎస్ఎల్‌వీసీ57 వాహకనౌక నింగిలోకి దూసుకెళ్లనుంది. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ఇస్రో చేపడుతున్న తొలి మిషన్ ఇదే కావడం విశేషం.

తొలుత ఆదిత్య ఎల్ 1ను భూమధ్యంతర కక్ష్యలో ప్రవేశపెడతారు. భూమి నుంచి సూర్యుని దిశగా 15లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లగ్రాంజ్ పాయింట్ 1కు చేరుకునేందుకు దీనికి 125 రోజుల సమయం పట్టనుంది. లగ్రాంజ్ పాయింట్ వద్ద సూర్యుడు, భూమి గురుత్వాకర్షణ శక్తి సమానంగా ఉంటుంది. అక్కడ ఎక్కువ కాలం సూర్యుడిపై పరిశోధనలు చేయవచ్చు. గ్రహణాలతో సంబంధం లేకుండా సూర్యుడిని నిరంతరం అధ్యయనం చేసేందుకు వీలు లభిస్తుంది. కరోనాగ్రఫీ పరికరం సాయంతో సౌర వాతావరణాన్ని లోతుగా పరిశోధించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, ఆస్ట్రేలియా, ఇతర దేశాల అంతరిక్ష సంస్థల సాయంతో సూర్యుడిపై అధ్యయనాలను ఇస్రో చేపడుతోంది. ఆదిత్యఎల్ 1 మొత్తం ఏడు పేలోడ్లను మోసుకెళ్లనుంది. ఇందులో విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్, సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పెరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య, సోలార్లో ఎనర్జీ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, హైఎనర్జీ ఎల్ 1 ఆర్బిటింగ్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్, మాగ్నెటోమీటర్ పేలోడ్‌లు ఉన్నాయి. సూర్యగోళం నుంచి ప్రసరించే అత్యంత శక్తిమంతమైన కాంతి ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు అనువుగా ఈ పేలోడ్‌లను రూపొందించారు. ఈ పేలోడ్లు ఎలక్ట్రోమాగ్నెటిక్, మాగ్నెటిక్ ఫీల్డ్ డిటెక్టర్ల సాయంతో సూర్యుడిలోని పొరలైన ఫొటోస్పియర్, క్రోమోస్పియర్, వెలుపల ఉండే కరోనాను అధ్యయనం చేస్తాయి. ఎల్ 1 ప్రదేశానికి ఉన్న సానుకూలతల దృష్ట్యా నాలుగు పరికరాలు నేరుగా సూర్యుడిని అధ్యయనం చేస్తాయి. మిగతా మూడు సాధనాలు.. సమీపంలోని సౌర రేణువులు, అయస్కాంత క్షేత్రాల గురించి శోధిస్తాయి.



# గాంధీ స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ మోడల్ ఈరోజు దేశానికి దిక్సూచిగా నిలిచింది. ఈ అభివృద్ధి నమూనా ఇదే విధంగా కొనసాగిస్తూ సకల జనులకు ప్రగతి ఫలాలను సమానంగా పంచడం ద్వారానే స్వాతంత్ర్యోద్యమ ఆశయాలను పరిపూర్తి చేసుకోగలుగుతాం. మనది న్యాయ పథం.. మనది ధర్మ పథం. సకల జనుల సంక్షేమమే మనకు సమ్మతం అని సీఎం కేసీఆర్ అన్నారు.

**గాంధీ సినిమా 35 లక్షల మంది వీక్షణ**

సమాచారశాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించిన గాంధీ సినిమాను 35లక్షల మంది విద్యార్థులు, ఇతరులు చూసి ప్రభావితమయ్యారని తెలిపారు. గాంధీ చిత్రాన్ని ఈ తరం వారికి పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవటం మనందరి బాధ్యత అన్న సీఎం కేసీఆర్ స్వాతంత్ర్య సమరయోధుల గొప్పతనం నేటి తరానికి సమగ్రంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సకల జనులకు ప్రగతి ఫలాలను సమానంగా పంచడం ద్వారానే స్వాతంత్ర్యోద్యమ ఆశయాలను పరిపూర్తి చేసుకోగలుగుతామని తెలంగాణ ముఖ్యమంత్రి అభిలషించారు. ముందుగా హెచ్ఐసీసీ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని సీఎం ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను సీఎం కేసీఆర్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు.

# దేవగౌడ మనవడికి షాక్

మొదటిపేజీ తరువాయి

రేవణ్ణ కు కర్ణాటక హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆయన లోక్‌సభ ఎన్నికపై అనర్హత వేటు వేసింది. ఎన్నికల సమాచారంలో తప్పుడు అఫిడవిట్ ఇచ్చినందుకు ఆయనపై అనర్హత వేటు వేస్తూ జస్టిస్ కె.నటరాజన్ పార్టీ శుక్రవారం తీర్పు చెప్పారు.

కర్ణాటకలోని హసన్ నియోజకవర్గానికి రేవణ్ణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019లో జేడీఎస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఏకైక నేత కూడా ఆయనే కావడం విశేషం. హసన్ నియోజకవర్గం ఓటరు జి.దేవరాజే గౌడ, అప్పట్లో రేవణ్ణ చేతిలో ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి ఎ.మంజు కోర్టుకు వెళ్లారు. నామినేషన్ పత్రాలు సర్పించేటప్పుడు తన ఆస్తి వివరాలు ఆయన దాటిపెట్టి తప్పుడు అఫిడవిట్ సమర్పించారని పిటిషనర్లు ఆరోపించారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం విచారణ జరిపి, కోర్టుకు నివేదిక సమర్పించింది. కాగా, హైకోర్టు తాజా తీర్పుతో ఆరేళ్ల పాటు రేవణ్ణ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోతారు. అయితే, హైకోర్టు తీర్పును రేవణ్ణ లీగల్ టీమ్ సుప్రీంకోర్టులో సవాలు చేసే వీలుంది.

# తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

మొదటిపేజీ తరువాయి

పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పింది మార్స్ గ్రూప్.వీటితో పాటు కూల్‌డ్రింక్స్ తయారీ సంస్థ కోకాకోలా సైతం.. తెలంగాణలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇటీవల మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన ఆ సంస్థ ఉపాధ్యక్షులు జేమ్స్‌మేక్ గ్రివి.. తెలంగాణలో విస్తరణకు ఆసక్తి చూపారు. ఇప్పటికే సిద్దిపేట జిల్లాలో ప్లాంట్ పనులు కొనసాగుతుండగా.. వరంగల్, కరీంనగర్ మరో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు చెప్పారు.

# ....జీవనశైలిని దెబ్బతీసే వ్యాధులు

మొదటిపేజీ తరువాయి

కార్యదర్శి బి.సుబ్బారెడ్డి, ప్రముఖ ఈఎన్టీ వైద్య నిపుణులు డాక్టర్ విష్ణుస్వరూప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'క్యాన్సర్ బారిన పడిన బాధితులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. పిల్లల చదువులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది తీవ్రమైన ఆరోగ్య సంక్షోభం. నివారణకు వైద్యులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసర చర్యలు తీసుకోవాలి. పొగాకు వాడకం వల్ల ఈశాన్య రాష్ట్రాల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ పెరుగుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పొగాకు వాడకం ఎక్కువగా ఉన్నందున ఆ ఉత్పత్తుల వాడకం వల్ల వచ్చే నష్టాలపై వైద్యులు విస్తృతంగా ప్రచారం చేయాలి. మరోవైపు ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి జీవనశైలి వ్యాధులు చుట్టుముడుతున్నాయి. సంప్రదాయ భారతీయ ఆహారం తీసుకోవడం మానేసి దుకాణాల్లో సిద్ధంగా ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్ తీసుకోవడం వల్లే రుగ్మతలు పెరిగిపోతున్నాయి. సామాజిక బాధ్యతగా దిన పత్రికలు, ప్రచార, ప్రసార సాధనాలు, డిజిటల్ మీడియా కూడా ఆయా అంశాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కల్పించాలి' అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

# షెడ్యూల్ ప్రకారమే ఈసీ ఎన్నికలు నిర్వహించాలి

- **బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు**
- **వన్ నేషన్- వన్ ఎలక్షన్ నినాదం తెరపైకి**
- **జమిలి ఎన్నికల ప్రచారంపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్,విశాలభారతి:** తాజా ఎన్నికల సర్వేలు పరిశీలిస్తే ఏ రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దేశంలో జమిలి ఎన్నికల ప్రచారంపై ఆయన స్పందించారు. షెడ్యూల్ ప్రకారమే ఈసీ ఎన్నికలు జరిపించాలని సూచించారు. ఈనెల 18 నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ నినాదం పేరిట ఓ ప్రతిపాదన తెరపైకి తీసుకురావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఓటమి నుంచి తప్పించుకునేందుకే జమిలి ఎన్నికల అంశం తెరపైకి తెచ్చారని తలసాని విమర్శించారు. తెలంగాణలో ఉంది కేసీఆర్ సర్కారు.. దేనికీ భయపడేది లేదని ధీమా వ్యక్తం చేశారు. ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించిన పార్టీ మాది.. భాజపాకు నిబద్ధత లేదని ఆక్షేపించారు. కేంద్రంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని, త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. పార్లమెంట్‌కు దీనికి లింకు పెడుతున్నారు.. అన్ని రాష్ట్రాల శాసనసభలు, పార్లమెంట్ రద్దు చేసి జమిలి ఎన్నికలకు వెళ్తే ఉత్తమం అని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



# ఆర్టీసీ ఆల్‌టైమ్ రికార్డు..

**- రాఖీపౌర్ణమి నాడు రికార్డు స్థాయి ఆదాయం**
**- ఒక్కరోజే రూ. 22.65 కోట్ల రాబడిని ఆర్జించినట్లు ఎండీ సజ్జనార్ వెల్లడి**

**హైదరాబాద్,విశాలభారతి:** తెలంగాణ ఆర్టీసీ సరికొత్త రికార్డులను నమోదు చేసింది. రాఖీ పౌర్ణమి నేపథ్యంలో గురువారం ఒక్కరోజే రూ. 22.65 కోట్ల రాబడిని ఆర్జించింది. ఈ మేరకు టీఎస్ఆర్టీసీ ప్రకటించింది. ఆర్టీసీ చరిత్రలో ఇదే ఆల్‌టైమ్ రికార్డు అని ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. గత ఏడాది రాఖీ పండగ నాడు రూ. 21.66 కోట్ల ఆదాయం సమకూరగా.. ఈసారి దాదాపు రూ.కోటి వరకు అదనంగా లభించింది. గురువారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 40.91లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. గత ఏడాదితో పోలిస్తే అదనంగా లక్ష మంది రాకపోకలు సాధించారు. ఒక్కరోజులో ఇంత పెద్ద సంఖ్యలో ప్రయాణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) విషయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా గతేడాది రికార్డును అధిగమించింది. 2022లో రాఖీ పండుగ నాడు 101.01 ఓఆర్ సాధించగా.. ఈసారి 104.68 శాతం నమోదు చేసింది. ఆ జిల్లా పరిధిలోని 7 డిపోల్లో.. నార్కెట్‌పల్లి మినహా మిగతా అన్నీ 100 శాతానికి పైగా ఓఆర్ సాధించాయి. ఆ తర్వాత వరంగల్ జిల్లాలో 97.05 శాతం.. ఉమ్మడి మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో 90 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది.





# హైకోర్టు తీర్పును అమలు చేయాలి

**- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ**

హైదరాబాద్, విశాలభారతి: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ శాసనసభ కార్యదర్శి కార్యాలయానికి వెళ్లారు. ఇటీవల ఆమెను గద్వాల ఎమ్మెల్యేగా నియమిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను శాసనసభ కార్యదర్శికి అందించేందుకు అక్కడికి వెళ్లారు. అయితే, ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి కోర్టు ఉత్తర్వులను అందించారు. హైకోర్టు తీర్పును కూడా అమలు చేయకపోవడం శోచనీయమని ఈ సందర్భంగా డీకే అరుణ అన్నారు. అందుకే కోర్టు కాపీని అందజేసేందుకు శాసనసభకు వచ్చినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వులను గౌరవించి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు ఇంకా ముందు వచ్చి ఉంటే బాగుండేదన్నారు.



# మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు తులాభారం

**- వచ్చిన డబ్బులు నామినేషన్‌కు అందజేత**

**హైదరాబాద్,విశాలభారతి:** బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై అభిమానులు, ప్రజలు ఒక్కో రకంగా అభిమానాన్ని చాటుకుంటున్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మేదరి సంఘం సభ్యులు మాత్రం రాబోయే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ ఖర్చుల కోసం అయ్యే డబ్బులను మంత్రి శ్రీనివాస్ గౌడ్ కు తులాభారం ద్వారా అందించారు. జిల్లా కేంద్రంలోని బండ్లగేరిలో మేదరి సంఘం ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మంత్రిని భారీ క్రేన్ ద్వారా పూలమాలతో స్వాగతం పలికి మంత్రి నిలువెత్తు బరువున్న రూపాయి నాణేలతో ఆయనకు తులాభారం వేశారు. ఈ డబ్బులను రాబోయే ఎన్నికల్లో నామినేషన్ ఖర్చులకోసం వినియోగించుకోవాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఊహించని రీతిలో తనపై ఇంతటి అభిమానం ప్రదర్శించడం ఎప్పటికీ మర్చిపోలేనని మంత్రి అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ మరోసారి విజయం సాధించాలని ప్రజలు తమ ఆదరాభిమానాలను ఈ విధంగా ప్రదర్శించడం ఎంతో ఉత్సాహాన్ని అందిస్తోందని పేర్కొన్నారు.

# కూటమి బలం చూసి బీజేపీకి గుబులు

మొదటిపేజీ తరువాయి

దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. దేశ ప్రజలు మోసపోరని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. నిరంకుశ ప్రభుత్వం నిష్క్రమణకు కౌంట్‌డౌన్ మొదలైందన్న ఆయన.. విపక్ష కూటమి బలాన్ని చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందన్నారు. ప్రతీకార రాజకీయాల్లో భాగంగా తమపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రభుత్వం దాడికి పాల్పడే అవకాశం ఉందన్న ఖర్గే.. వాటన్నింటికి సిద్ధంగా ఉండాలని భాగస్వామ్య పక్షాలకు పిలుపునిచ్చారు.

**కేంద్రం కీలక నిర్ణయం.. 'ఒకే దేశం- ఒకే ఎన్నికలు'పై కమిటీ..**

'ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా.. దేశ ప్రజలు మరోసారి మోసపోరు. 140 కోట్ల భారతీయులు మార్పును కోరుకుంటున్నారు. నిరంకుశ ప్రభుత్వం నిష్క్రమణకు కౌంట్‌డౌన్ మొదలయ్యింది' అని ఖర్గే పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ నియంత్రణలోకి తీసుకోవాలని భాజపా కోరుకుంటోందన్న ఆయన.. ఇండియా కూటమి బలోపేతం అవుతున్న తరుణంలో తమ నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలతో బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ముంబయిలో రెండోరోజు జరిగిన విపక్షాల కూటమి సమావేశంలో భాగంగా నేతలందరితో దిగిన బృంద ఫొటోను షేర్ చేసిన ఖర్గే.. 'భారత్ ఏకమవుతుంది.. ఇండియా గెలుస్తుంది' అనే నినాదాన్ని ఇచ్చారు.

**ఎన్నికల వాయిదా కోసమే: విపక్షాలు**

'ఒకే దేశంఒకే ఎన్నిక'పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై విపక్ష పార్టీలు భగ్గుమంటున్నాయి. ఈ ప్రక్రియ దేశంలో సమాఖ్య స్ఫూర్తికి ముప్పు కలిగిస్తుందని ఆరోపించాయి. సీపీఐ నేత డీ రాజా మాట్లాడుతూ.. భారత్ ప్రజాస్వామ్య దేవాలయం అని చెప్పే ప్రధానమంత్రి, ఇతర రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. విపక్షాల ఐకమత్యాన్ని చూసి అధికారపక్షం భయపడుతుందనడానికి ఇది నిదర్శనమని ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ప్రియాంక కక్కర్ పేర్కొన్నారు. తొలుత గ్యాస్‌పై రూ.200 తగ్గించడం, అనంతరం రాజ్యాంగాన్ని సవరించే ప్రయత్నాలు చూస్తుంటే.. వచ్చే ఎన్నికల్లో భాజపా గెలవదనే విషయాన్ని గుర్తించినట్లు ఉందన్నారు. దేశంలో ఎన్నికలను వాయిదా వేసే కుట్ర అని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. దేశంలో నిష్పక్షపాత ఎన్నికలు జరగాలని తాము డిమాండు చేస్తున్న సమయంలో.. ప్రజల దృష్టి మరల్చేందుకే కేంద్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు ఉపక్రమించిందని దుయ్యబట్టారు.



# హుస్నాబాద్‌లో భరిలో ఉంటా

- **సీపీఐ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**

**హైదరాబాద్,విశాలభారతి:** గతంలో వలే కాకుండా కాంగ్రెస్ సాధ్యమైనంత త్వరగా పొత్తుల విషయం తేల్చి, అభ్యర్థులను ప్రకటిస్తే బాగుంటుందని సీపీఐ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి తెలిపారు. ప్రధానంగా 5 స్థానాలను తాము అడుగుతున్నామని.. అందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్ కూడా ఉందన్నారు. హుస్నాబాద్ నుంచి పోటీలో ఉండాలని కార్యకర్తలు తనను కోరుతున్నట్లు చెప్పారు. చర్చలు అనంతరం పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలన్నారు. ఎవరితో పొత్తులు ఉన్నా లేకపోయినా జాతీయ పార్టీగా తాము బరిలో ఉంటామని చాడ స్పష్టం చేశారు.

## ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు
# గడువు పొడగింపు

**హైదరాబాద్,విశాల భారతి:** తెలంగాణలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును సెప్టెంబర్ 16 వరకు పొడిగించారు. రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఈనెల 16వరకు కాలేజీల్లో చేరవచ్చని ఇంటర్ బోర్డు తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం వరకు ఇంటర్ ఫస్టియర్‌లో 4,92,873 మంది చేరారు. రాష్ట్రంలోని 1285 ప్రైవేటు కాలేజీల్లో 3,11,160 మంది విద్యార్థులు చేరగా.. 408 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 83,177 మంది చేరారు. ఎస్సీ గురుకులాల్లో 16,102 మంది, బీసీ గురుకులాల్లో 14,077 మంది, మైనారిటీ గురుకులాల్లో 10,506, గిరిజన గురుకులాల్లో 8,416, జనరల్ గురుకులాల్లో 2,560 మంది విద్యార్థులు చేరారు. గతేడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,98,699 మంది చేరారు.

**బైపీసీ అభ్యర్థులకు 2 నుంచి ప్రవేశాల ప్రక్రియ**

తెలంగాణ ఎంసెట్ బైపీసీ అభ్యర్థులకు ఈ నెల 2వ తేదీ నుంచి ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ నెల 4, 5వ తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన, 4 నుంచి 7 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఫార్మసీలో 114 కాలేజీల్లో 6,910 కన్వీనర్ కోటా సీట్లు ఉన్నాయి. ఫార్మ్‌డి కోర్సులో 61 కళాశాలల్లో 1,192, బయోటెక్నాలజీలో 94,బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో 36, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్‌లో 81 కన్వీనర్ కోటా సీట్లు ఉన్నాయి.

# టీచర్ల బదిలీలకు షెడ్యూల్ విడుదల

**- 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో టీచర్ల బదిలీలకు తెలంగాణ హైకోర్టు పచ్చజెండా ఊపడంతో ఈనెల 2 నుంచి ప్రభుత్వం బదిలీల ప్రక్రియను చేపట్టనుంది. దీనికి సంబంధించి తెలంగాణ విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ బదిలీల్లో ఉపాధ్యాయ దంపతులకు అదనపు పాయింట్లు కేటాయించనుంది. తుది తీర్పునకు లోబడే టీచర్ల బదిలీలు జరగాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా.. బదిలీల కోసం ప్రభుత్వానికి విద్యా శాఖ ప్రతిపాదనలు పంపింది. దీని ప్రకారం బదిలీలు కోరుకునేవారు ఈనెల 3 నుంచి 5 వరకు అన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. 6,7 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలి. 8, 9 తేదీల్లో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు అధికారులు డిస్‌ప్లే చేస్తారు. 10,11 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. 12,13న సీనియారిటీ జాబితాలను ప్రచురిస్తారు. 14న ఎడిట్ చేసుకునేందుకు ఆప్షన్ ఇస్తారు. 15న ఆన్‌లైన్ ద్వారా ప్రధానోపాధ్యాయుల బదిలీలు చేపట్టి, 16న ప్రధానోపాధ్యాయుల ఖాళీలను ప్రదర్శిస్తారు. 17,18,19 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎంలుగా పదోన్నతులు ఇస్తారు. 20, 21 తేదీల్లో ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ప్రదర్శన చేస్తారు. 21న వెబ్ ఆప్షన్లు పెట్టుకుంటే.. 22న ఎడిట్ ఆప్షన్‌ను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. 23,24 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ బదిలీలు చేపడతారు. 24న స్కూల్ అసిస్టెంట్ ఖాళీల ప్రదర్శన ఉంటుంది. 26, 27, 28 తేదీల్లో ఎస్టీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందుతారు. 29,30,31 ఎస్టీటీ ఖాళీల ప్రదర్శన ఉంటుంది. అక్టోబర్ 2న ఎడిట్ ఆప్షన్స్ ఉంటాయి. అక్టోబర్ 3న ఎస్టీటీ, భాషాపండితులు, పీఈటీల బదిలీలు చేపడతారు. అక్టోబర్ 5 నుంచి 19వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఇస్తారు.

**ప్రతిపాదిత నిబంధనలు ఇవే..**

సెప్టెంబర్ ఒకటో తేదీ కటాఫ్ డేట్‌గా లాంగ్ స్టాండింగ్‌కు ఉపాధ్యాయులకు 8 సంవత్సరాలు, ప్రధానోపాధ్యాయులకు 5 సంవత్సరాల నిబంధన వర్తించేలా ప్రతిపాదించింది. 5 లేదా 8 ఏండ్లు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు/ ప్రధానోపాధ్యాయుల స్థానాలను ఖాళీలుగా జాబితాలో చేరుస్తారు. రిటైర్మెంట్‌కు మూడు సంవత్సరాలలోపు సర్వీసున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఉంది. అన్ని రకాల పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసుకోవాలని రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా అధికారులకు సూచనలు ఇచ్చారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి, ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల దరఖాస్తులను ఎడిట్ చేసుకునే అవకాశాన్ని, అదనంగా స్పౌజ్ బదిలీలకు పాయింట్లు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. సెప్టెంబర్ ఒకటి నాటికి 50 సంవత్సరాల లోపు వయసు ఉండి బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్బంధ బదిలీ వర్తింప జేస్తూ ప్రతిపాదనలు పంపింది.



# భారత స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

**-సీఎం కేసీఆర్ కు ఘన స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ గాంధీ**

**శేరిలింగంపల్లి విశాల భారతి:** మాదాపూర్ లోని హెచ్.ఐ.సి.సి లో జరిగిన స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో శుక్రవారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి వేడుకల్లో పాల్గొనందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ను ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ ఘన స్వాగతం పలికారు.




# యువతకు ఉపాధి కల్పించేందుకే ఐటీ హబ్

- **నల్గొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**
- **మెగా జాబ్‌మేళా ప్రారంభం**

**నల్లగొండ, విశాల భారతి :** పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు నల్లగొండకు చెందిన ఎన్నారైలు ఐటీ హబ్‌లో తమ కంపెనీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణం లోని లక్ష్మీ గార్డెన్స్‌లో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డి రూ.95 కోట్లతో నల్లగొండకు ఐటీ హబ్ మంజూరు చేశారని తెలిపారు. ఐటీ హబ్‌లో నియామకాల కోసం మెగా జాబ్ మేళా నిర్వహించగా 12 వేల మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. మొత్తం 3,600 మందికి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటివరకు 15 కంపెనీలు వచ్చాయి. మొత్తం 50 కంపెనీలు భవిష్యత్తులో రానున్నాయని స్పష్టం చేశారు. నల్లగొండకు ఐటీ హబ్ కొత్త అందాన్నిచ్చి, మణిహారంలా నిలిచిందన్నారు. గత కాంగ్రెస్ నాయకులు ఐటీ హబ్ తెస్తాం అని చెప్పి మాట తప్పారని విమర్శించారు. నల్లగొండ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం ఇచ్చారని ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలిచి మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని అన్నారు. నల్లగొండలో ప్రగతి ఆగకూడదంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ ఢీకొని ఆర్ఎంపి వైద్యుడు మృతి

**బాల్కొండ, విశాల భారతి:** బైక్ ఢీకొని ఆర్ఎంపి వైద్యుడు మృతి చెందినట్లు భీమ్‌గల్ ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం మెండోర గ్రామానికి చెందిన మృతుడు కాంటం రాజు(33) అనే వ్యక్తి గ్రామంలో అర్ఎంపి వైద్యునిగా పనిచేస్తూ విధి నిర్వహణలో భాగంగా జులై 30 రాత్రి పని చేసుకొని తిరిగి బైక్ పై వస్తున్నాడు. అదే గ్రామానికీ చెందిన సంఘాపు చిన్నారెడ్డి అనే వ్యక్తి నిర్లక్ష్యంతో బైక్ నడుపుతు రాజును డీకొట్టాడు. రాజు తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స కోసం నిజామాబాద్ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ హాస్పిటల్ కు తరలించారు. ఆగస్టు 31 ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందాడు. దాంతో మృతునీ కుటుంబికులు శుక్రవారం శవంతో ప్రమాదానికి కారణమైన చిన్నా రెడ్డి ఇంటి ముందు ఆందోళన నిర్వహించి, ఇంటి ముందర కట్టెలతో



చితిపేర్చి అంత్య క్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భాదిత కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో సర్ధుమనిగారు. మృతిని భార్యా కాంటం మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.



# అరూరు గ్రామంలో యువజన కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** వలిగొండ మండలం అరూరు గ్రామంలో వలిగొండ జడ్పిటిసి వాకిటి పద్మా అనంతరెడ్డి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భువనగిరి నియోజకవర్గం ఇంచార్జ్ వెలిమినేటి సురేష్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ ఎన్నుకోవడం జరిగింది యువజన కాంగ్రెస్ గౌరవ అధ్యక్షులు గడ్డల మల్లేష్ గ్రామ శాఖ అధ్యక్షునిగా రేఖ మచ్చ గిరి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర సాయి గౌడ్ ఉపాధ్యక్షులు మాటూరు సాయి గౌడ్ వాకిటి దీక్షిత్ రెడ్డి జినకల రాజు కొల్లూరు వినోద్ జనరల్ సెక్రటరీ పోలేపాక మహేష్ ,ననుబాల నవీన్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ బుర్ర శ్రీకర్, కోశాధికారి బోగారం గణేష్ కార్యవర్గ సభ్యులు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్ గౌరవ అధ్యక్షులు వేముల ఎట్టయ్య ఉపాధ్యక్షులు జినుకల మల్లేష్ యాదవ్ బండారం మైపాల్ రెడ్డి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పరమేష్ కసిర బోయిన లింగయ్య యాదవ్ కసర బోయిన మచ్చ గిరి యాదవ్ బండారు చిన్న నరసింహారెడ్డి చిలకమర్రి కనకాచారి నరేష్ యాదవ్ పందిరి సంపత్ కొడితల కరుణాకర్ చిలకమర్ ఉపేందర్ పోలపాక నరసింహ , నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# దుర్గం చిన్నయ్య కు ఓటు వేయకండి

- **చిన్నయ్య బాధితురాలు శేజల్ ప్రచారం**
- **బిఆర్ఎస్,బిజేపి నేతల మధ్య తోపులాట**
- **కోడి రమేష్ ఇంటి ముందు చీర, గాజులతో ఆందోళన**

**బెల్లంపల్లి,విశాలభారతి:** బెల్లంపల్లి పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్ ఆధ్వర్యంలో శేజల్ మెయిన్ బజార్లో ఉన్న ప్రతి షాప్ షాప్ కి తిరుగుతూ తనకు జరిగిన అన్యాయాన్ని అందరికి చెప్పుకుంటూ దుర్గం చిన్నయ్యకు ఓటయకండి అంటూ ప్రచారం మొదలు పెట్టింది. దీంతో కొద్దిసేపటి తర్వాత బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొద్దిమంది వచ్చి ప్రచారాన్ని ఆపాలని వాదనకి దిగారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్ కు బిఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. విషయం తెల్సుకున్న 1టౌన్ ఎస్ హెచ్ ఓ శంకరయ్య బృందం వచ్చి పరిస్థితి ని సద్దుమణిగించే ప్రయత్నం చేసారు. అయినా కూడా సద్దుమాంగలేదు. దీంతో మహిళా కానిస్టేబుల్స్ శేజల్ని అక్కడినుండి తీసుకెళ్లారు. బిఆర్ఎస్ నాయకులు అక్కడినుండి శేజల్ వెంటపడ్డారు. శేజల్ని పోలీస్ వారు పోలీస్ స్టేషన్ కు తరలించారు. బి ఆర్ ఎస్ నాయకులు బి జేపి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. కాసేపు వాహనాలకి అంతరాయం ఏర్పడింది.



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రేసిడెంట్ నూనెటీ సత్యనారాయణ, అధికార ప్రతినిధి కాసార్ల యాదగిరి,బి ఆర్ ఎస్ నాయకులు కుంభలా రాజేష్‌లు మాట్లాడుతు బిజెపి నాయకులు అమ్మాయిని అడ్డం పెట్టుకొని శికండి రాజకీయాలు,నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మూడవసారి చిన్నయ్య ఎమ్మెల్యే గెలవబోతున్నాడానే వాస్తవాన్ని జీర్ణించుకోలేక పోతున్నరన్నారని మండిపడ్డారు. అనైతిక రాజకీయాలు కాకుండ బిజెపికి దమ్మొంటే న్యాయంగా ఓట్ల ద్వారా తేల్చుకావాలని సవాల్ విసిరారు.

**కోడి రమేష్ ఇంటిని ముట్టడించిన బిఆర్ఎస్**

బిజెపి పట్టణ అధ్యకుడు కోడి రమేష్ బయటకి రావాలంటూ శేజల్ని అడ్డంపెట్టుకొని నీవు చేసే బాగోతలు అందరికి తెలుసని బి ఆర్ ఎస్ మహిళా నాయకురాళ్లు నాయకులు పెద్ద ఎత్తున నినదించారు. శేజల్ని కాదు ప్రచారానికి తిప్పడం నువ్వే చీర జాకెట్ గాజులు వెస్కొని ప్రచారం చేస్కో అంటూ ఆయన ఇంటిముందు చీర జాకెట్ గాజులు ఉంచారు





# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన**

**చిట్యాల, విశాల భారతి :** నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పీఆర్టీయూ టీఎస్ చిట్యాల మండల శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేస్తూ తహసీల్దార్ దశరథ కి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందని కావున ఉపాధ్యాయులకు నష్టం కలిగించే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సిపిఎస్) ను ప్రభుత్వం రద్దుచేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కొత్త పెన్షన్ విధానాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్కల విజయ సారధి మర్యాద అశోక్ రెడ్డి ఎదురుల నాగరాజు లు పాల్గొన్నారు.

# నాంచారమ్మ గుడికి రూ. 50,000 అందజేసిన శ్రీకాంత్ గౌడ్

**ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేత**

**దేవరుప్పుల, విశాల భారతి :** సమాజ హితానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు సామాజికవేత్త బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.మండలంలోని సీతారాంపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న నాంచారమ్మ గుడి నిర్మాణానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం 50వేల రూపాయలు విరాళంగా అందజేశారు.శుక్రవారం ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేష్ సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్ చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు.ఈ సందర్భంగా ఎరుకల కుల పెద్దమనుషులు గ్రామస్తులు మాట్లాడుతూ మా కోరిక మేరకు వెంటనే స్పందించి ఆలయ నిర్మాణానికి ఆర్థిక



సాయం అందించిన బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బస్వ వెంకన్న ఉపసర్పంచ్ పాషా కూరాకుల గీత,స్వప్న కూరాకుల పద్మ కూరాకుల నాగ కూరాకుల రజిత మానుపాటి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మొగులయ్య మృతి పార్టీకి తీరని లోటు

**దేవరుప్పుల,విశాలభారతి :** మండలం, కామారెడ్డి గూడెం కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింత వెంకన్న తండ్రి మొగులయ్య మృతి పార్టీకి తీరని లోటని 'మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది.కృష్ణమూర్తి గౌడ్ అన్నారు. మొగులయ్య మృతదేహానికి నివాళలర్పించి, మృతుని కుటుంబాన్ని పరామర్శించి,ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నారెడ్డి.నర్సిరెడ్డి, తాటిపెల్లి.సోమయ్య,గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు మారేపల్లి. మురళి,గ్రామ పార్టీ కోశాధికారి ఓడపల్లి పుల్లయ్య,గ్రామ పార్టీ యూత్ అధ్యక్షుడు



కొంగరి. ఉమేష్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చింత. నిఖిల్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింత. అశోక్, చింత ఉపేందర్, ఓడపల్లి రామ్, తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు

**పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**పాలకుర్తి , విశాలభారతి :** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జీ రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి జాటోత్ ఇందిర పాలకుర్తి తెలుగు యువత నేత ఎడవెల్లి సన్నీ ఆకుల శ్రీనివాస్ గుగులోతు నరేశ్ కుర్వ శివ ఎడవెల్లి నవీన్ పల్లేర్ల వెంకటేశ్ కుర్ర దేవి తదితరులు హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో శుక్రవారం చేరారు. అలాగే పాలకుర్తికి చెందిన కాంగ్రెస్ పార్టీ సిరిపాటి ఎల్లస్వామి సిరిపాటి మహేశ్ లు పాలకుర్తి ఉప సర్పంచ్ తరాల చంద్ర బాబు వార్డు సభ్యుడు వీరమనేని హన్మంతరావుల ఆధ్వర్యంలో బిఆర్ ఎస్ లో చేరారు. వాళ్ళందరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కేసీఆర్ పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై బిఆర్ఎస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు. మంత్రి ఎర్రబెల్లి నాయకత్వంలో తమ గ్రామ అభివృద్ధికి తాము పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు.

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరిన వారికి తగిన రీతిలో సముచిత గౌరవ మర్యాదలు ఉంటాయని చెప్పారు. వాళ్లంతా గ్రామ అభివృద్ధికి పాటుపడాలని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.



# బీఆర్ఎస్‌తోనే నిరుపేదలకు మేలు


- **దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర నాయక్**
- **బీఆర్ఎస్ హ్యాట్రిక్ గెలుపు ఖాయం**

**దేవరకొండ, విశాల భారతి :** బీఆర్ఎస్‌తోనే పేద ప్రజలకు మేలు జరుగుతుంది అని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన బీజేపీ పార్టీ నుంచి 50మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. గులాబీ జెండాతో తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తున్నదని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీలో రూ100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొంది మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షలు అందజేస్తున్నామని వివరించారు. రైతు బంధు అధ్యక్షుడు కేసాని లింగా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ దాస్రు, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ గంధం సురేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిమినేటి సాయి, అబ్బనబోయిన శ్రీను, కోడిదాల వెంకటయ్య, బొడ్డుపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ లీడర్ల ఆధ్వర్యంలో 'పల్లె ప్రగతి'

**మణుగూరు, విశాల భారతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగ కాంతారావు ఆదేశాల మేరకు కేసీఆర్ పల్లె ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా మణుగూరు మండలంలోని, దమ్మక్కపేట గ్రామంలో మండల జడ్పీటీసీ మెంబర్‌పోశం నరసింహారావు , మణుగూరు మండల అధ్యక్షుడు ముత్యం బాబు కేసీఆర్‌పల్లె ప్రగతి బాట కార్యక్రమం శుక్ర వారం నిర్వహించి డోర్ టు డోర్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పినపాక నియోజకవర్గంలో అత్యధికంగా ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రేగా కాంతారావు నాయకత్వాన్ని బలపరుస్తూ చేరుతున్నారన్నారు. ఇంత మంచి పథకాలను ప్రవేశపెట్టే ప్రభుత్వాన్ని మళ్లీ అధికారులకు తీసుకురావడానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని అన్నారు, ఎమ్మెల్యేగా గెలుపు ఖాయం , అధిక మెజార్టీ లక్ష్యంగా ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను ప్రజలకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దమ్మక పేట సర్పంచ్ కురసం రాంబాబు, ఉపసర్పంచ్ పోతురాజు వెంకటేశ్వర్లు, పినపాక నియోజకవర్గం అసంఘటిత కార్మిక రంగం అధ్యక్షులు కత్తి రాము, మణుగూరు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మడి వీరన్న బాబు, ఉప్పుతల రామారావు, బర్ల సురేష్, వేర్పుల సురేష్,దమ్మక్క పేట బీఆర్ఎస్ పార్టీ గ్రామ పంచాయతీ అధ్యక్షులు దరాజు వెంకటేశ్వర్లు, తంతరపల్లి కృష్ణ, కంపల్లి సత్యనారాయణ, పెనుగొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రీశుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి అనుపమ చక్రవర్తి

**యాదాద్రి, విశాల భారతి :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న జస్టిస్ అనుమపమ చక్రవర్తి యాదాద్రీశుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వాదం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.




# ఆర్మూర్ లో మట్టి కథ సినిమా బృందం సందడి

**ఆర్మూర్, విశాల భారతి:** పట్టణంలోని క్షత్రియ కళాశాలలో మట్టికథ సినిమా బృందం సందడి చేశారు. పట్టణంలోని క్షత్రియ ఇంటర్మీడియట్ కాలేజ్ లో కళాశాల యాజమాన్యం ఏర్పాటుచేసిన మట్టికథ సినిమా యూనిట్ కు అభినందన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్షత్రియ కళాశాల కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడారు. తెలంగాణ యువకులు, తెలంగాణ పల్లె కథాంశంగా చిత్రాన్ని రూపొందించి 9 అవార్డులు కైవసం చేసుకోవడం తెలంగాణకే గర్వ కారణం అని ఆయన అన్నారు. మట్టికథ సినిమాకు తెలంగాణలో మంచి ఆదరణ లభిస్తుందని ఆయన ఆకాంక్షించారు. మట్టి కథ సినిమా దర్శకుడు పవన్ కడియాల మాట్లాడుతూ తెలంగాణ పల్లె జీవన విధానాన్ని కథాంశంగా తెరకెక్కించిన ఈ సినిమా తెలంగాణ ప్రజల మనసులను దోచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే మట్టి కథ సినిమా వస్తుంది కావున ఆదరించాలని కోరారు. మట్టి కథ సినిమా కోలీవుడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, తమిజగం ఇంటర్నేషనల్ ఫెస్టివల్ అవార్డులు మొత్తంగా తొమ్మిది అవార్డులు కైవసం చేసుకుంది అని అన్నారు. కథానాయకుడు అజయ్ వేద్ మాటలకు విద్యార్థిని విద్యార్థులు కేరింతలు కొడుతూ పాటలకు కథానాయకుడితో కలిసి స్టెప్పులు వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్, కళాకారుడు కోకిల నాగరాజు, మట్టికథ చిత్రం యూనిట్ సభ్యులు శ్రీనివాసరావు రుచిత అక్షయ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్భయంగా షీ టీమ్స్ కు ఫిర్యాదు చేయండి

**వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్**




**వరంగల్, విశాల భారతి :** ప్రత్యక్షంగాని లేదా పరోక్షంగాని ఆకతాయిలతో లైంగిక వేధింపులకు గురవుతున్న అమ్మాయిలు, మహిళలు ఇకనైనా మౌనం వీడి నిర్భయంగా షీటీమ్స్ కు ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ మహిళలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీమ్స్ పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ ఉమెన్ సేఫ్టీ విభాగం అధ్వర్యంలో పనిచేస్తున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీమ్స్ యువతులు, మహిళల రక్షణకై నిరంతరం శ్రమిస్తున్నారని. ముఖ్యంగా ఆన్లైన్, ఆన్లైన్ ఎక్కడైనా ఎప్పుడైనా అమ్మాయిలు, మహిళలను వేధించే ఆకతాయిల పట్ల వరంగల్ షీ టీమ్స్ పోలీసులు కఠిన వ్యవహరిస్తునే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని. షీ టీమ్స్ పనితీరుపై మహిళలకు మరింత నమ్మకం పెరగడంతో ఆకతాయిలపై మహిళలు, యువతులు చేస్తున్న ఫిర్యాదుల సంఖ్య ఘననీయంగా పెరిగిందని. ముఖ్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ సంవత్సరంలో జనవరి మాసం నుండి ఆగస్టు 31 తేది వరకు 208 ఫిర్యాదులు అందగా.. విచారణ అనంతరం 21 మంది పోకిరీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి 134 మంది అరెస్టు చేయగా, 105 మందిపై పెట్టీ కేసులు నమోదు కాగా, 82 మందికి షీ టీం కార్యాలయములో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. గడిచిన ఆగస్టు మాసంలో 25 ఫిర్యాదులు రాగా, ఇద్దరుపై క్రిమినల్ కేసులు, 15 మంది పెట్టీ కేసులు మరో 8మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. షీ టీమ్స్ పై మరింత అవగాహన కల్పించేందుకుగాను రైల్వే స్టేషన్, బస్టాండ్, ఆలయాలు, పబ్లిక్ గార్డెన్స్, పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాళ్ళ వద్ద షీ టీమ్స్ అధ్వర్యంలో మహిళల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయి. ఈ సంవత్సవం ఇప్పటి వరకు 134పైగా అవగాహన సదస్సులు ఎర్పాటు చేయబడ్డాయి. అలాగే ప్రత్యేక పోస్టర్లు, బ్యానర్లను కూడా రూపొందించడం జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, అమ్మాయిల భద్రత కోసం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో షీ టీం బృందాలు పనిచేస్తున్నాయని, ఇన్స్పెక్టర్ నేతృత్వంలో ఒక మహిళతో సహ ముగ్గురు ఎస్.ఐలు, ఒక ఎ.ఎస్.ఐ, నలుగురు హెడ్ కానిస్టేబుళ్ళు, 5 కానిస్టేబుళ్ళ, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ళతో పాటు ఒక మహిళా హోంగార్డు పనిచేస్తాన్నారు. ఇకపై ఎవరైన ప్రత్యక్షంగాని, పరోక్షంగాని లేక సామాజిక మాధ్యమాల్లో ద్వారాని మహిళలు, యువతులు లైంగిక వేధింపులకు గురైయ్యే తక్షణమే షీ టీమ్స్ నంబర్లు 8712685142, 8712685270 లేదా డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

న్యాయవాదులపై జరుగుతున్న

# భౌతికదాడులను అరికట్టాలి

**ఐలు జిల్లా అధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి**



**రామన్నపేట, విశాల భారతి :** దేశవ్యాప్తంగా న్యాయవాదులపై భౌతిక దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో న్యాయవాదుల చాంబర్లోకి వెళ్లి ప్రత్యర్థులుహత్య చేశారని ఈ దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని న్యాయవాదుల జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి కోరారు. న్యాయవాదిపై జరిగిన దాడికి వ్యతిరేకంగా న్యాయవాదులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే న్యాయవాదులపై పోలీసులు లాఠీ చార్జీ చేశారు, ఉత్తరప్రదేశ్ పోలీసుల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని ఆయన కోరారు. న్యాయవాదులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే న్యాయవాదులపై లాఠీ ఛార్జ్ చేసిన పోలీసు అధికారులపై చట్ట రీత్యా తగిన చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.





# అమ్మవారికి ఘనంగా పుష్పాభిషేకం

**చిట్యాల, విశాల భారతి :** శ్రావణ మాస మహోత్సవాలలో బాగంగా 3వ శుక్రవారం చిట్యాలలోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ప్రధాన అర్చకులు ధౌలతాబాధ్ వాసుదేవ శర్మ ఆచార్యత్వంలో అమ్మవారికి పుష్పాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కి పారాయణం చేస్తూ కలువ, తామర, సంపంగి, దవనం, గన్నేరు కనకాంబరి లిల్లీ ఎర్ర చామంతి, మందార, సన్నజాజి, గులాబీ,మల్లె వంటి పలు రకాల పూలతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని కార్యక్రమాలను తిలకించారు. అనంతరం పుష్పాలంకరణకి సహకరించిన పెద్దకాపర్తి మాజీ సర్పంచ్ కందిమళ్ళ రేణుక శిశుపాల్ రెడ్డి లను ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శీలా సత్యనారాయణ, డైరెక్టర్లు గంజి వెంకటేశం, పోకల అచ్చాలు, బుద్ధ విమల కృష్ణమూర్తి, సాయి రెడ్డి ప్రతాప రెడ్డి, జిట్ట శేఖర్, వరకాంతం నర్సిరెడ్డి, నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే చోరీ.. భయంతో కాలనీ వాసులు



**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ పట్టణంలోని అయ్యప్ప నగర్ కాలనీలో శుక్రవారం పట్టపగలే చోరీ జరగడంతో కాలనీ వాసులు భయపడుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యజమాని కోమటి నరేందర్ భార్య ఇంటికి తాళం వేసి కిరాణా షాప్ కి వెళ్ళింది. దుకాణం నుండి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. గుర్తు తెలియని దొంగలు గేట్ దూకి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడినట్లు గుర్తించారు. ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న 12తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బంగారు నగల పక్కన ఉన్న వెండి వస్తువులు ముట్టు కోలేదని, కేవలం బంగారు నగలు ఎత్తు కెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దొంగతనం విషయమై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా, క్లూస్ టీంతో వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

# బీపీ పెరిగి పొలంలో పడి మహిళ మృతి



**మునగాల, విశాల భారతి:** బీపీ అకస్మాత్తుగా పెరగడంతో తాను చేస్తున్న పొలంలోనే కుప్పకూలిపోయి ఓ మహిళ చనిపోయిన సంఘటన మండల పరిధిలోని తిమ్మారెడ్డి గూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం యర్రం వనజ(32) ప్రతిరోజు మాదిరిగానే తన పొలంలో పనిచేసేందుకు వెళ్లిన క్రమంలో అకస్మాత్తుగా వనజకు బీపీ పెరగడంతో ఉక్కిరి బిక్కిరై కళ్ళు తేలవేసింది. ఇద్దరు మహిళలు పక్కనే ఉండడంతో వనజ కుప్పకూలి కింద పడుతున్న సమయంలో కేకలు వేయడంతో ఇద్దరు మహిళలు దగ్గరికి వచ్చి వనజకు గుండెపోటు అనుకొని సీ.పి.ఆర్ చేశారు. కళ్ళు తిరుగుతూ చేతులు కాళ్లు లాగుతున్నాయని వనజ చెప్పడంతో ఆమెకు బిపి పెరిగిందని ఆ మహిళలు తెలుసుకున్నారు. వెంటనే ఆ మహిళలు హాస్పిటల్ కు వనజను తీసుకెళ్లాలని సిద్ధమవుతున్న తరుణంలో అప్పటికే ఆమె ప్రాణాలు విడిచింది. ఈ విషయం తెలుసుకున్న తన అత్త, బంధువులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని భోరున విలపించారు. సంవత్సరం క్రితమే తన భర్త సైదిరెడ్డి మృతి చెందిన విషయంలో వనజ ఎంతో నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. వనజ భర్త మృతి చెందిన క్రితం సంవత్సరం కిందట తన మామ మృతి చెందాడు. ఒకే కుటుంబంలో వరస మరణాలు జరుగుతుండడంతో పలు రకాల అనుమానాలకు దారితీస్తుంది. వనజకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు పిల్లలు తన తల్లిదండ్రులు కోల్పోవడంతో వారి పరిస్థితి దిక్కుతోచని పరిస్థితిగా ఏర్పడింది. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలను చూచి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.



# వీవోఏల జీతాల పెంపు హర్షణీయం

**సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి ఫొటోలకు క్షీరాభిషేకం**

**మహబూబాబాద్/తొర్రూర్, విశాల భారతి :** రాష్ట్రంలోని మహిళా సంఘాల సహాయకుల వివోఏ లకు రక్షాబంధన్ కానుకగా వేతనాల పెంపు చేయడంపై మండలంలోని పలు గ్రామాల వివోఏలు సీఎం కేసీఆర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుల చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వివోఏల సంఘం అధ్యక్షుడు సనికినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాఖీ పండుగ కానుకగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ ల కు జీతాల పెంపు చేయడం హర్షనీయమన్నారు. జీతాల పెంపుకు కృషిచేసిన మంత్రి దయాకర్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఉపేందర్,వివోఏ ల సంఘం ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల మంజుల,కోశాధికారి ఎస్.కె సక్కిన, ఉపాధ్యక్షులు ఈదునూరి రవీందర్, ఓబిలు మమత, సంధ్య, రమ, రజిత, సువర్ణ, రజిత, సుమలత, దర్గన్న, నెహ్రూ, సీసీలు పాల్గొన్నారు.



# చనిపోయిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

**రామన్నపేట, విశాల భారతి:** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త వనం శ్రీను (42) అనారోగ్యంతో మృతి చెందడంతో వెల్లంకి సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్ డి మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీను కుటుంబ సభ్యులకు రూ.10,000 ఆర్థికసాయం అందజేసి, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలియజేశారు. అలాగే శ్రీను కుటుంబానికి ఎంపీటీసీ మహేందర్ రెడ్డి రూ. 5,000 బీఆర్ ఎస్ మాజీ అధ్యక్షుడు ఎడ్ల నరేందర్ రెడ్డి రూ.5,000 అందజేశారు. ఈ కార్యక్రమంలోబీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడ్ల సురేందర్ రెడ్డి, కర్రె రమేష్, బుట్టి వెంకటేశు, బొమ్మకంటి ఉపేందర్, వరికుప్పల కాశీరాం తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

**మణుగూరు, విశాల భారతి :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అనేక గ్రామాలలో వీధీ దీపాలు వెలగక గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయని, మున్సిపల్ కమిషనర్ కి ఎన్నిసార్లు సమస్యను విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, వెంటనే జిల్లా అధికారులు స్పందించాలని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శుక్రవారం పలు గ్రామాలను సందర్శించి గ్రామాల్లో నెలకొన్న ఉన్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినప్పటికీ గ్రామాల్లో కాలువల వెంట చిన్న చిన్న చెట్లు విరిగిపోయి, కాలువలు పూడిక తీయకుండా , పారిశుద్ధ్యం చేయడం లేదని దీనివలన చెరువు పక్కన ఉన్నటువంటి గ్రామాలలో పాములు సంచరిస్తున్నాయని, వానా కాలం కావడంతో పాములు తేళ్లు రోడ్ల వెంట కాలువల వెంట కనబడుతూ ఇల్లలకు వస్తున్నాయని, రాయి గూడెం, అన్నారం, కమలాపురం, శివలింగాపురం ఇలా అనేక గ్రామాలలో అక్కడక్కడ వీధి దీపాలు పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ కి విషయము తెలియజేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. వీరి వెంట గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సొందే కుటుంబరావు. ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి అక్కి నరసింహారావు, కార్యవర్గ సభ్యులు ఎస్ వి నాయుడు,జక్కుల రాజబాబు ,రాయల బిక్షం ,రావుల రాములు, ఆదరణ రాములు, చింతల దశరథం, ఉపేందర్, కన్నెబోయిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# స్పృహ కోల్పోయిన మహిళకి చికిత్స చేయించిన కౌన్సిలర్

**కౌన్సిలర్ బండి ప్రభాకర్**



**బెల్లంపల్లి, విశాలభారతి:** బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డు గంగారం నగర్ వెనకాల డ్యాం దగ్గర గుర్తు తెలియని మహిళ స్పృహ కోల్పోయి ఉండడం చూసి స్థానిక ప్రజలు, కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన వెంటనే స్పందించి టూ టౌన్ ఎస్ఐ కి ఫోన్ చేసి పిలిపించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్ పిలిపించి బెల్లంపల్లి గవర్నమెంట్ హాస్పటల్ తీసుకోని వెళ్లి అడ్మిట్ చేయించి.. ట్రీట్మెంట్ చేయించ్చారు. అలాగే ఒక ఫోన్ చేయగానే వెంటనే వచ్చిన ఎస్ఐ కి కౌన్సిలర్ ప్రభాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు.



# సీపీఎస్ ను రద్దు చేయాలి


**జాక్టో జిల్లా చైర్మన్ సుధాకరా చారి**

**మహబూబాబాద్ / తొర్రూర్, విశాల భారతి :** ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జాక్టో చైర్మన్ కొరవి సుధాకరాచారి డిమాండ్ చేశారు. సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ జాక్టో ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జాక్టో జిల్లా చైర్మన్ కొరివి సుధాకరాచారి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ పొందే హక్కు రాజ్యాంగం కల్పించిందని సిపిఎస్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిపిఎస్ విధానానికి రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2003 డీఎస్సీ వారికి న్యాయం చేయాలన్నారు ప్రభుత్వం వెంటనే పిఆర్సి కమిటీ వేసి ఐ ఆర్ ను ప్రకటించాలన్నారు. పండిత్, పీఈటిలకు పదోన్నతులు కల్పించాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు త్వరగా చేపట్టాలన్నారు. టీచర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మహబూబాబాద్ కు తరలి వెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించినట్లు సుధాకరాచారి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రప్రకాష్ , గుంటుక యాకయ్య , సుధాకర్ , ప్రభాకర్ రావు ,శకుంతల, యాకూబ్ రెడ్డి, ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.

# భూపోరాటంలో వెంకట్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయం




**సూర్యాపేట (విశాల భారతి) :** సీపీఐ ఎంఎల్ సీనియర్ నాయకుడు కామ్రేడ్ మిరియాల వెంకట్ రెడ్డి ప్రధమ వర్ధంతి సభ స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎమ్మార్వో లింగంపల్లి భద్రయ్య మాట్లాడుతూ నక్సల్ బరి పోరాట పిలుపును అందుకొని దున్నే వానికే భూమి కావాలనే లక్ష్యంతో సాగిన పోరాటంలో కామ్రేడ్ మీర్యాల వెంకటరెడ్డి ముందు వరుసలో ఉన్నాడని, మార్కెట్ దోపిడీ కి వ్యతిరేకంగా మరియు సారా వ్యతిరేక పోరాటంలో ముందు ఉండి అనేక అక్రమ కేసులను ఎదుర్కొన్నాడని, దోపిడీ, పీడన అణిచివేతలు లేని రాజ్యం కావాలని కలలు కన్నాడు అన్నారు. రాజ్యహింస కు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి పోరాడి సమ సమాజం ఏర్పడేంతవరకు పోరాడటమే కామ్రేడ్ మిర్యాల వెంకట రెడ్డి కి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ సభలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం డేవిడ్ కుమార్ ,సిపిఐ ఎంఎల్ నాయకులు బుద్ధ సత్యనారాయణ, నారగోని వెంకట్ యాదవ్ ,బిసిపి జిల్లా కార్యదర్శి నరసయ్య , ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కునుకుంట్ల సైదులు ,దామోదర్ రెడ్డి , సైదులు, బోల్ల సోమిరెడ్డి, కారింగుల వెంకన్న ,సామ నర్సిరెడ్డి,పోలబోయిన కిరణ్ , వీరబోయిన రమేష్,పిడమర్తి భరత్, సయ్యద్, అశోక్ రెడ్డి, చిరంజీవి, జయరాజు, వెంకట్ రెడ్డి ,భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# 'నాకు ఒక్క పైసా దొరక లేదు..'

**బెల్లంపల్లి, విశాల భారతి:** ఒక దొంగ బ్యాంక్ దొంగతనానికి వచ్చాడు. అతనికి అక్కడ ఏం దొరక లేదు. దీంతో ఏం చేయలేక వెనుదిరిగాడు. వెళ్తూ వెళ్తూ.. ఒక పేపర్ పై విషయం రాసి వెనుదిరిగాడు. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలంలో దక్కన్ గ్రామీణ బ్యాంక్ ఉంది. గురువారం రాత్రి ఆ బ్యాంక్ లో ఒక వ్యక్తి దొంగతానికి ప్రయత్నించాడు. అది చాలా చిన్న బ్యాంక్ కావడంతో అందులో ఏం దొరక లేదు. దీంతో నిరాశతో వెనదిరిగిన దొంగ.. అక్కడే ఉన్న న్యూస్ పేపర్ పై మార్కర్ తో రాశాడు. 'నాకు ఒక్క పైసా దొరక లేదు. గుడ్ బ్యాంక్ ఇది.. నన్ను పట్టుకోవద్దు.. ఫింగర్ ప్రింట్స్ దొరకవు..' అని రాసి మరీ వెళ్ళిపోయాడు. ఉదయం ఈ విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీమ్ ద్వారా వివరాలు సేకరించారు. కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గాదరి కిషోర్ హ్యాట్రిక్ విన్ ఖాయం

**శాలిగౌరారం, విశాల భారతి :** రాబోయే సాధారణ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గ అభ్యర్థిగా ముచ్చటగా మూడో సారి డాక్టర్ గాదరి కిశోర్ విజయ కేతనం ఎగర వేస్తాడని బీఆర్ ఎస్ మండల ఎస్సీ సెల్ ప్రచార కార్యదర్శి బందెల ఉదయ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ సీ ఎం కేసీఆర్, మంత్రి జగదీష్ రెడ్డి ల సహకారంతో తుంగతుర్తి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ,సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటున్నారని,శాలిగౌరారం యువత మొత్తం ఎమ్మెల్యే కిశోర్ వెంటనే ఉందని, వచ్చే ఎన్నికల్లో మూడో సారి హ్యాట్రిక్ గెలుపు ని ఎవరు కూడా ఆపలేరన్నారు.

## వట్టె జానయ్య అనుచరులు బెదిరిస్తున్నరు

**కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు**



**తుంగతుర్తి, విశాల భారతి:** ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ బాధితుల్లో తుంగతుర్తి మండలానికి చెందిన దాదాపు 50 మందికి పైగా ఉన్నామని, తాము కొనుగోలు చేసిన ప్లాట్లలో జానయ్య అనుచరులు బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ తో పాటు ఆర్డీవోకు తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము 2006 లో సూర్యాపేటలోని గాంధీ నగర్ వద్ద జానయ్య ఇంటి ముందు గ్రామపంచాయతీ పర్మిషన్‌తో వట్టె జానయ్య తో పాటు మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన మామిడి శ్రీను కలిసి వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ లో తుంగతుర్తి. గానుబండ తూర్పు గూడెం బండ రామారం తదితర గ్రామాలకు చెందిన పలువురు ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు భవిష్యత్తులో తమ పిల్లల పెళ్లిళ్లకు అవసరం వస్తుందని భావించి కొనుగోలు చేసినట్లు తెలిపారు వెంచర్ విక్రయదారులు 364/ఆ సర్వే నెంబర్ తో తమ ప్లాట్లను హద్దు రాళ్లను చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. వాస్తవంగా అట్టి వెంచర్ 415 సర్వే నెంబర్లు ఉంది దీంతో తాము మోసపోయామంటూ గ్రహించి డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన ప్లాట్లను తమను మోసం చేశారని అధికారుల ముందు వాపోయారు ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తాము కొనుగోలు చేసిన ప్లాట్లను తమకు ఇప్పించే విధంగా అధికారులు ప్రయత్నం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## ఏ పార్టీలో చేరను..

**'అరికెల' ఉన్నాడుగా..**



**నిజామాబాద్, విశాల భారతి:** సీనియర్ నేత, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు మళ్లీ వార్తల్లో కేంద్ర బిందువయ్యాడు. చాలా రోజులుగా ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నాడు. పార్లమెంటు ఎన్నికల్లో కేసీఆర్ స్వయంగా వెళ్లి ఆయన్ను బీఆరెస్‌లో చేర్చుకున్నా.. ఆ తర్వాత పార్టీ పట్టించుకోలేదు.. ఆయనా దూరంగానే ఉన్నాడు. మధ్యమధ్యలో బీజేపీలో చేరుతున్నాడని, కాంగ్రెస్‌లో చేరుతున్నాడనే ఊహాగానాలు మాత్రం వస్తూనే ఉన్నాయి. దీనిపై ఆయన తన సన్నిహితుల వద్ద కొన్ని నర్మగర్భంగా కామెంట్లు చేశాడని విశ్వసనీయంగా తెలిసింది. ' ప్రస్తుత రాజకీయాలు నాకు పడవు. నేను సెట్ కాను. నా రాజకీయ జీవితం ముగిసింది. నేనిప్పుడు ఏ పార్టీలో లేను. రాను..' అని చెబుతూనే... ' అరికెల నర్సారెడ్డి కాంగ్రెస్ నుంచి ట్రై చేస్తున్నాడుగా..' అంటూ సూత్రప్రాయంగా, పరోక్షంగా అతనికి సపోర్టు చేయాల్సిందిగా కూడా సన్నిహితులు ఫోన్లు చేసినప్పుడు చెబుతున్నాడని సమాచారం.

## దళిత బంధు ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య**



**మణుగూరు, విశాల భారతి :** రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన దళత బంధు పథకానికి అర్హులను పారదర్శకంగా ఎంపిక చేయాలని , భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీ లో 'గృహలక్ష్మి' కి ఉన్న ఆంక్షలు వెంటనే ఎత్తివేయాలని, అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకం వర్తింప చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్‌చేశారు. శుక్రవారం స్థానిక శ్రామిక భవనంలో మాచారపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ బిఆర్ఎస్ జండా పట్టుకుంటేనే దళిత బంధు, గృహలక్ష్మి ,బీసీలకు లక్ష రూపాయలు ఇస్తామని బిఆర్ఎస్ నాయకులు చెప్పడం సబబు కాదన్నారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు దళిత బంధు మొదటి విడత ప్రజా ప్రతినిధులు చెప్పినట్లు కాకుండా పారదర్శకంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. అర్హులైన పేదలకు ఇవ్వకుండా బిఆర్ఎస్ నాయకులకే ఇచ్చేందుకు ఎమ్మెల్యే దొడ్డిదారి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గృహలక్ష్మి పథకానికి ఏజెన్సీలో గిరిజనేతరులకు 1970కి ముందు ఇంటి స్థలం కొనుగోలు చేసినట్లు పక్కా ఆధారాలు చూపించాలని చెబుతున్నారు. పక్క ఆధారాలు లేక పేదలు గృహలక్ష్మికి అర్హులు కాలేకపోతున్నారని అన్నారు కుటుంబంలో ఒకరికి మాత్రమే గృహలక్ష్మి పథకం వర్తింప చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. కొత్త రేషన్ కార్డులు లేక అనేక ఏళ్లుగా మంజూరు చేయకపోవడంతో కొత్తగా వివాహమైన వారు ,అప్పటివరకు ఉమ్మడి కుటుంబం లో ఉండి విడిపోయిన వారు ఒకే రేషన్ కార్డులో కొనసాగుతున్నారు, గృహలక్ష్మి నిబంధనలకు రేషన్ కార్డును పరిశీలించి అందులో ఒక మహిళ పేరుతో మాత్రమే మంజూరు చేస్తున్నారని అన్నారు దీనివలన గిరిజనులకు కూడా గృహలక్ష్మి కి అనర్హులుగా మిగిలిపోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కోడిశాల రాములు, టీవీ ఎంవీ ప్రసాద్, పిట్టల నాగమణి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



## సందయ్య మెమోరియల్ ట్రస్ట్ విద్య, వైద్యంపై దృష్టి అమోఘం

**శేరిలింగంపల్లి విశాల భారతి:** సామాజిక, రాజకీయ సేవా రంగాలలో ముందు వరుసలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు బిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్ లు నిలుస్తారని కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు అన్నారు. శుక్రవారం చందానగర్ మున్సిపల్ కార్యాలయం అంబేద్కర్ బొమ్మ వద్ద ఏర్పాటు చేసిన సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని సందర్శించి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి కంటి పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. పేద వారికి కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు అందరి దగ్గర ఉంటుంది కానీ దానిని దానం చేసే గుణం కొందరి కొంతమందికే ఉంటుందని.. అందులో బిక్షపతి యాదవ్ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. సామాజిక, రాజకీయ, కార్యక్రమాలు మరువలేనివని తండ్రి బాటలో యువ నాయకుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ కూడా భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడి నాయకులను, కార్యకర్తలను కలుపుకుపోయి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు, అనంతరెడ్డి, మణి భూషణ్, దేవాల్ యాదవ్, మహిపాల్ రెడ్డి, నవత రెడ్డి , సింధురెడ్డి, ఎల్లేష్, శ్రీధర్ గౌడ్, కోటేశ్వరరావు, రామ్ రెడ్డి, అర్జున్, రమణయ్య, శ్రీనివాస్ యాదవ్, రమేష్, రాజేష్, రాజు,లక్ష్మణ్,గణేష్ ముదిరాజ్ , లక్ష్మణ్ ముదిరాజ్, మల్లేష్ గౌడ్, రమేష్, యాదగిరి ముదిరాజ్ , రమేష్, సత్యనారాయణ, దేవానంద్ యాదవ్, చందర్ యాదవ్ ,గౌస్, కృష్ణ దాస్,మన్యం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య యోధుల ఆశయ సాధనకు కృషి చేయాలి

**మహబూబాబాద్/తొర్రూర్, విశాల భారతి :** ప్రధాని మోడీ పిలుపు మేరకు 'ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈ రోజు తొర్రూర్ లో బీజేపీ ఆధ్వర్యంలో మేరా మిట్టిమేరా దేశ్ కార్యక్రమం స్థానిక పాటిమీద హనుమాన్ దేవాలయం వద్ద ప్రారంభం చేసి పవిత్ర మట్టి సేకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య మాట్లాడుతూ ప్రధాని మోడీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రతీ గ్రామం, పట్టణం లో పవిత్ర స్థలం నుంచి గానీ, అమరవీరుల ఇంటి నుంచి గానీ మట్టి సేకరించి డిల్లీ లో కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమర యోధుల స్మారకం గా నిర్మిస్తున్న అమృత వనం లో భాగస్వామ్యం చేస్తామన్నారు. భారతమాత విముక్తి పోరాటం లో ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా బలిదానం చేస్తే నేటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని తెలిపారు. నాటి అమరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ క్రృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా కార్యదర్శి పరుపాటి రాం మోహన్ రెడ్డి, ఎస్సీ మోర్చా మహబాద్ పార్లమెంట్ ఇంఛార్జి అలిసేరి రవిబాబు,జిల్లా నాయకులు మంగళపల్లి యాకయ్య, బొమ్మనబోయిన కుమార్,రాయపురం రాజుకుమార్,సిహెచ్.విజయ్ కుమార్,గంధం రాజు, నూకల నవీన్,పప్పుశెట్టి సంతోష్, క్రాంతి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇవ్వాలి

**ఒగ్గు సైదులు డిమాండ్**

**మోతె, విశాల భారతి :** భవన నిర్మాణ కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం మోటారు సైకిలను ఇస్తామని ప్రకటించి ఏండ్లు గడుస్తున్నా.. నేటికీ ఇవ్వలేదని, ప్రభుత్వం వెంటనే కార్మికులందరికీ మోటార్ సైకిల్ ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఒగ్గు సైదులు డిమాండ్ చేశారు. శుక్రవారం మోతె మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి గత మూడు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులందరికీ మోటార్ సైకిల్ ఇస్తామని చెప్పారని మోటారు సైకిల్ వస్తాయని ఎంతో మందిఆశతో ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కార్మికులు నిరాశే మిగిలిందన్నారు. సెప్టెంబర్ 5న హైద్రబాద్ లో ని లేబర్ కార్యాలయం ముందు ధర్నాకి కార్మికులు అధిక సంఖ్యలో తరిరావాలని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. కార్డు ఉన్న ప్రతి కార్మికునికి ఇంటి నిర్మాణం కోసం పది లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని కోరారు. 50సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికునికి 5000 రూపాయల పెన్షన్ మంజూరు చేయాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోతె మండల కార్యదర్శి మంద ఉపేందర్, గౌరవ అధ్యక్షులు నార్ల రంగయ్య,సహాయ కార్యదర్శి అంజి తదితరులు పాల్గొన్నారు.



## వలస నాయకులు వద్దు.. లోకల్ నాయకులే ముద్దు

**బెల్లంపల్లి, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని లంబాడితండా, తాళ్ళ గురిజాల, మాలాగురిజాల, రంగంపేట దుగ్నపల్లి, బట్వానపల్లి మీదుగా పెర్కపల్లి గ్రామాలలో కాంగ్రెస్ గడపగడపకి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఓ బి సి చైర్మన్ బండి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ తొంగల మల్లేష్ మండల్ ప్రెసిడెంట్ బాకం మల్లేష్, దూడ మహేష్ సింగం బక్కన్న, వంగ రామన్న, డాకూరి సురేష్, ముత్తె కొమురయ్యా, వెంకట్ యాదవ్ జంగంపల్లి శ్రీనివాస్ ఖలీల్, యువజన కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా పల్లెల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం కడుతున్నారు. పదేళ్లు పరిపాలించిన నాయకులకు ఇంటి పంపక తప్పదు అని అన్నారు...



## ఒక్క రోజే రూ.29,441 ఆదాయం

**రాష్ట్రంలోనే ఆరోస్థానంలో నిలిచిన తొర్రూరు డిపో**

**మహబూబాబాద్/ తొర్రూర్, విశాల భారతి :** రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) తొర్రూరు డిపో చరిత్రలోనే సరికొత్త రికార్డులను నమోదైనట్లు డిపో మేనేజర్ పరిమళ తెలిపారు. నిన్న ఒక్క రోజే రూ.29,441 లక్ష రాబడి సంస్థకు వచ్చిందని చెప్పారు. ఆర్టీసీ చరిత్రలో ఇదే ఆల్ టైం రికార్డు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో డ్రైవర్లకు, కండక్టర్లకు, సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ రాఖీ పౌర్ణమి నాడు రికార్డు స్థాయిలో లక్షల మంది టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఒక్క రోజులో ఇంత పెద్ద ఎత్తున ప్రయాణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఆక్యూపెన్సీ రేషియా ఓఆర్ విషయానికి వస్తే.. రాష్ట్రంలోనే ఆరవ స్థానంలో ఓఆర్ నమోదైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎస్ టి ఐ రజిత రెడ్డి, ఏడీసీలు ఆర్ఎస్ కుమార్, కె.వి.రెడ్డి, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సొంతగూటికి చేరిన దత్తాపూర్ ఎంపీటీసీ దంపతులు



**ఆర్మూర్, విశాల భారతి:** దత్తపుర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ గంగదేవి, మహేష్ దంపతులు బిఆర్ఎస్ పార్టీ నుంచి బిజెపిలో చేరారు. వీరికి ఆర్మూర్ బీజేపీ నాయకుడు పైడి రాకేష్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో బీజేపీలో గెలిచి బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి తీర బిఆర్ఎస్ లోకి రావాలని ఒత్తిడి చేసి బలవంతంగా అధికార పార్టీలో చేర్చుకున్నారు అని.. అయినా అభివృద్ధికి నిధులు ఇవ్వలేదు అని అన్నారు. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ గెలుపు ఆర్మూర్ లో అత్యవసరం అని అతి త్వరలో బీజేపీలోకి ముఖ్య నాయకులు వస్తున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు కూడా టచ్ లో ఉన్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డోంకేశ్వర్ మండల అధ్యక్షుడు సురేందర్ ఎంపీటీసీ లు సంజీవ్, చిన్నారెడ్డి బీజేపీ అసెంబ్లి కన్వీనర్ పలేపు రాజు, కల్లెం సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో చిట్యాల ఎంపీపీ



**చిట్యాల, విశాల భారతి :** 75వ స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలు హెచ్ ఐ సీసీ లో రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకల్లో చిట్యాల ఎంపీపీ కొలను సునీత వెంకటేష్ గౌడ్, జడ్పీటీసీ సుంకర ధనమ్మ యాదగిరి గౌడ్, కేతపల్లి జడ్పీటీసీ స్వర్ణలత పాల్గొన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్రాన్ని గణనీయమైన అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది అని అలాంటి నాయకుడు దొరకడం తెలంగాణ ప్రజల అదృష్టమని ఎంపీపీ అభిప్రాయపడ్డారు.

## నేరాలకు పాల్పడితే ఎప్పటికైనా శిక్షలు తప్పవు


**సూర్యాపేట, విశాల భారతి :** సూర్యాపేట జిల్లా మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామ సర్పంచ్ జూలకంటి పులిందర్ రెడ్డి హత్య కేసులో సూర్యాపేట జిల్లా కోర్టు ఆరుగురు నిందితులకి యావజీవ కారాగార శిక్ష విధిస్తూ తుది తీర్పు వెల్లడించింది. 2014 జనవరి 30న కోదాడ బైపాస్ రోడ్డు లో జూలకంటి పులిందర్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. హతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగించారు. కేసు దర్యాప్తు లో బాగంగా 31 మంది సాక్షులను, బాధితులను, నిందితులను విచారించిన జిల్లా కోర్టు 6 గురు నేరస్తులను గుర్తించి నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రిన్సిపల్స్ సెషన్స్ జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.రాజగోపాల్ తీర్పును ఇవ్వడం జరిగినది అని జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఐపీఎస్ వివరించారు.విచారణ సమయంలో జలీల్ అనే నిందితుడు మృతి చెందగా మిగిలిన ఐదుగురు నేరస్తులు షేక్ షబ్బీర్, కొప్పుల లక్ష్మీనారాయణ, షేక్ ఇబ్రహీం, మాతంగి శ్రీను, ధూళిపాల నరేందర్ లను జైలుకు పంపడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపినారు. ఈ సందర్భంగా బాధితుల పక్షాన కేసును వాదించిన పి పి శ్రీవాణి, కోదాడ డి.ఎస్.పి ప్రకాష్ లను సన్మానించారు.అప్పటి పి పి వెంకటేశ్వర్లు, కేసు పర్యవేక్షణ చేసిన డి.ఎస్.పి ప్రకాష్, ఇన్స్పెక్టర్ రాము, కోర్టు డ్యూటీ అధికారి హెడ్ కానిస్టేబుల్ వెంకట రమణ, లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ సురేంద్ర బాబు లను ఎస్పీ అభినందించారు.



## వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి

**చేయూత రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎండీ రమేశ్**

**మహబూబాబాద్/ తొర్రూర్, విశాల భారతి :** తొర్రూర్ మండల కేంద్రంలో చేయుత రూరల్ డెవలప్ మెంటు సోసైటీ కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్లకు రివ్యూ సమావేశం జరిగింది. సంస్థ ఎండి ఎం రమేష్ పాల్గొని మాట్లాడుతూ . పంటకు నీరు పెట్టడం క్రమంగా అరబెట్టడం. ఇలా చేయడం ద్వారా వాతావరణం లో ప్రమాద కరమైన కాలుష్య కారకమైన మీతిన్ వాయువు విడుదల తగ్గుతుంది. ఈ విధానం లో వరిసాగు చేయటం ద్వారా వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందడం జరుగుతుంది. అని అన్నారు. వరి చేను క్రింద పడి పోదు, చీడ పీడలు ముఖ్యంగా దోమపోటు ఉధృతి తక్కువగాఉంటుంది. అదేవిదంగా ఇప్పటికి జిల్లా వ్యాప్తంగా 15755 రైతులకు 42180 ఎకరాలు మన ప్రాజెక్టు కు అనుబందంగా పనిచేస్తున్నారు. అనిఅన్నారు.ఇంకా మన సంస్థ స్వచ్ఛంద సేవా సంస్థను కోర్ కార్బన్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రైతుల వద్దకు వ్యవసాయ క్షేత్రంలో తడి పొడి విధానంలో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవ సంస్థ డైరెక్టర్ జి. శ్రీదేవి, జిల్లా కొఆర్డినేటర్ రాజేష్, క్లస్టర్ ఆర్డినేటర్ బి,ఉపేందర్, ఇంకా 15 మంది కోఆర్డినేటర్లు. జిల్లా వ్యాప్తంగా పాల్గొన్నారు.



## శ్రీ లలితా దేవికి మహా హారతి

**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా మందిరంలో శ్రీ లలితా దేవికి వైభవం ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా మహా హారతి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్ జోషి, పరమేష్, వీరయ్య పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**ఆమనగల్లు, విశాల భారతి:** తెలంగాణ వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలు నూతన ఒరవడిని సృష్టిస్తున్నాయని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమానంగా మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తూ పంచాయతీలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల 10 లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు పనులు పూర్తయ్యాయని.. అదే విధంగా పదో వార్డులో నిర్మాణం అవుతున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల, స్థానిక శాసనసభ్యులు జైపాల్ యాదవ్, ప్రజాప్రతినిధుల తోడ్పాటుతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మిగిలి ఉన్న పనులను రాబోయే రోజులలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పనుల పరిశీలనలో రెఖ్య తండా సర్పంచ్ హరిచంద్ నాయక్, స్థానిక నేతలు సూద యాదయ్య,వెంకటేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కర్ణాటక మాజీ మంత్రి మునిరత్నం నాయుడు**



**శేరిలింగంపల్లి ,విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి లోని ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన గచ్చిబౌలి డివిజన్ శక్తి కేంద్రాల ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షుల సమావేశంలో కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్ర రావులతో కలిసి ముఖ్యఅతిథిగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు సాధిస్తామని చెప్పి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని, నేడు వాటిని తుంగలో తొక్కారని ఆరోపించారు. దళిత బంధు పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని, గిరిజన బంధు లేదని, మూడెకరాలు లేదన్నారు. కెసిఆర్ కుటుంబ, అవినీతి పాలన అంతమొందించేందుకు, అధికారమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధి లోనీ ప్రతి పోలింగ్ బూత్, కమిటీ, శక్తి కేంద్రాలను మరింత పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, బూత్ ఇంచార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్రల ఇంచార్జిలు, డివిజన్ నాయకులు, బీజేవైఎం నాయకులు, యువ మోర్చా నాయకులు , మహిళా మోర్చా నాయకులు , కిసాన్ మోర్చా నాయకులు , ఎస్సీ మోర్చా నాయకులు , ఎస్టి మోర్చా నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## పట్నం మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు

**శేరిలింగంపల్లి విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా పట్నం మహేందర్ రెడ్డి పదవీ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం మంత్రి నివాసంలో ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డితో కలసి ఆయనకు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి

**ఆమనగల్లు, విశాల భారతి :** పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి అని జడ్పీటీసీ దశరథ్ నాయక్ చెప్పారు. శుక్రవారం కడ్తాల్ మండలం గానుగుమర్ల తండాకు చెందిన జ్యోతికి రూ.20వేలు, అనుమాస్పల్లి సంతోషకు రూ.7500 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరవగా శుక్రవారం అందజేశారు. సీఎంఆర్ఎఫ్తో పేదలు కార్పొరేట్ ఆసుపత్రిలో సకాలంలో వైద్య సేవలు చేయించుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హంస మోత్య, ఉప సర్పంచ్ శారదా పాండు వార్డు సభ్యులు శ్రీను నాయక్ , భీమన్ నాయక్, సోమ్లా నాయక్, ప్రేమ్ , జీడిఎన్ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ , నాయకులు పాండు,అంజి, శ్రీను, రమేష్ , చందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## సర్వీ సమాజ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది

**శేరిలింగంపల్లి విశాల భారతి:** సర్వీ సమాజ్ ట్రస్ట్ శేరిలింగంపల్లి ప్రతి నిధులు మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ సర్వీ సమాజ్ ట్రస్ట్ సమాజం కోసం కమ్యూనిటీ హాల్ ని అతి త్వరలోనే నిర్మాణానికి కృషి చేస్తానని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామనిఅన్నారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం వలన సర్వీ సమాజ్ ట్రస్ట్ సభ్యులు సమావేశాలు, సమ్మేళనాలు ఏర్పటుకు ఫంక్షన్స్, వారికి సంబంధించిన సమావేశాలు నిర్వహించుకోవడాని అనుగుణంగా కమ్యూనిటీ హాల్ ను అన్ని హంగులతో నిర్మిస్తామని తెలిపారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, సర్వీ సమాజ్ ట్రస్ట్ సభ్యులు అధ్యక్షులు మనోజ్ చౌదరి, వైస్ ప్రెసిడెంట్లు మంగిలాల్, పరిహరియా చౌదరి, కంగర్ సొయాల్ చౌదరి, సెక్రటరీ హనుమన్ సోయల్ చౌదరి, సెక్రటరీ మంగిలాల్ సొన్వర చౌదరి, ట్రెజరర్ వినోద్ గెహ్లాట్ చౌదరి, వినోద్ చౌదరి, వినయ్ చౌదరి, కెహ్వారామ్ చౌదరి పాల్గొన్నారు.




## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**శేరిలింగంపల్లి విశాల భారతి:** సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అమోఘమని శేరిలింగపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. నల్లగండ్ల రవీందర్ రెడ్డి గార్డెన్స్ లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శేరిలింగంపల్లి మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ కౌరస్పాండెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయుడి పేరుతో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం మన సంస్కృతిలో అంతర్భాగమైందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం విద్య అందుబాటులో ఉండక పోవడం ప్రజల మధ్యన అంతరాలు సృష్టించడం వంటి పరిణామాల నేపధ్యంలో చిన్న చిన్న దేశాలు కుడా భారతదేశం మీదకు దండయాత్రకు వచ్చాయన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యార్థులలో ప్రతిభను గుర్తించి వారిలో సృజనాత్మకను ఉపాధ్యాయులు వెలుగులోకి తెచ్చినందునే దేశం అద్భుతమైన పురోగతి సాధిస్తుందన్నారు. అనంతరం కార్పొరేటర్ మండల్ ప్రైవేటు స్కూల్ యాజమాన్యాన్ని ప్రోత్సహిస్తూ, టీచర్ల ను అభినందించి, పదవ తరగతిలో ఉత్తమ ర్యాంక్ సాదించిన విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్రో సైంటిస్ట్ రఘునందన్ రావు గారు, ఎన్ఆర్ఎస్సి జి. శ్రీనివాస్ రావు,రమణి, సైంటిస్ట్ బిజ్జం వెంకటేశ్వర రెడ్డి, ఎం వెంకట రెడ్డి,టిఆర్ఎస్ఎంఎ జనరల్ సెక్రెటరీ ఎస్ఎన్ రెడ్డి, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె అనిల్ కుమార్, ఆర్ఆర్డిఆర్ ఎస్పిసిఏ ప్రెసిడెంట్ జి. నారాయణ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఏ భరత్ గౌడ్,సన్ షైన్ స్కూల్ డైరెక్టర్ పవన్ కుమార్, ట్రెజరర్ మీనేందర్ రావు, ప్రెసిడెంట్ మారోజు ఆచార్య, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ శంకర్,డైరెక్టర్ ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఎన్ రఘునందన్ కుమార్,ట్రెజరర్ మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, చీఫ్ అడ్వైజర్ గాయం భీష్మ రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ అండ్ టీం ఫ్రొం బ్రహ్మకుమారిస్ బి.కె వసంత లక్ష్మి, సన్ షైన్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## వాల్యూ గోల్డ్ సంస్థను ప్రారంభించిన యాంకర్ అనసూయ భరద్వాజ్

**మేడిపల్లి, విశాల భారతి:** పీర్జాదిగూడలో టీవీ యాంకర్ అనసూయ వాల్యూ గోల్డ్ యూనిట్ ను యాజమాన్యంతో కలిసి ప్రారంభించారు. ఆమె ఈ సంస్థకి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారు. అనసూయ మాట్లాడుతూ.. మీ బంగారాన్ని ధైర్యంగా అమ్మండి.. కొంటాము అన్నారు. యూనిట్ ప్రారంభించిన వ్యక్తులు నమ్మకమైన వాళ్ళని, ఎప్పటినుండో అందరూ తనకు తెలుసు అని అన్నారు. గోల్డ్ అనేది ఇన్వెస్ట్మెంట్ అని దాన్ని అమ్మొచ్చు, కొనొచ్చు అన్నారు. అలానే ఎవరైనా ఎక్కడైనా బంగారం పై లోన్ తీసుకుని కట్టలేని పరిస్థితి ఉంటే వాళ్ళకి తమ సంస్థ ఆ బంగారాన్ని విడిపించి ఆ రోజుకి ఎంత రేటు ఉందో ఆ రేట్ కు వాళ్లకు తిరిగి డబ్బులు చెల్లిస్తారని.. ఈ అవకాశాన్ని ఇక్కడి ప్రజలు ఉపయోగించుకోవాలని అనసూయ యాజమాన్యం తెలియజేసారు.



## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన స్వర్ణకారుల సంఘం లీడర్లు

**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో శుక్రవారం వలిగొండ మండల స్వర్ణకారుల సంఘ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి స్వర్ణకారుల భవనానికి ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి రూ.10 పది లక్షల మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎమ్మె లింగస్వామి, వెల్వర్తి దేవాలయ కమిటీ చైర్మన్ నామాల ఉప్పలయ్య, గౌరవ అధ్యక్షుడు చిట్టోజు వెంకట్ నారాయణ, అధ్యక్షడు దాసోజు విఠల్ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రీనివాస చారి కోశాధికారి చిట్టోజు సత్యనారాయణ సీనియర్ నాయకులు కన్నెకంటి స్వామి కొల్లోజు రఘు చిట్టోజు నరసింహ చారి దాసోజు వెంకన్న కన్నెకంటి శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.



## డయాలసిస్ పేషంట్‌కు ఆర్థికసాయం

**రామన్నపేట, విశాల భారతి :** రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన తాటి వీరాస్వామి కుమారుడు తాటి నరేందర్ కు రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ నడుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ ప్రెసిడెంట్ ఇడెం శ్రీనివాస్ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 15,000 ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఇడెం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఇడెం రాధ, రవ్వ సత్యనారాయణ , అంకెం పాండు , రుద్ర సురేష్ , మిర్యాల నాగార్జున , కొంగరి రాంమూర్తి , మిర్యాల రాజు , గువ్వల నర్సింహ్మా , ఆవనగంటి లక్ష్మయ్య పాల్గొన్నారు



## మైనారిటీల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంది

**బోడుప్పల్, విశాల భారతి:** మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కతుబ్ షాహి మస్జీద్ నందు కో ఆప్షన్ సభ్యులు నాజీయా అబ్దుల్ అలీం, మస్జీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ సామల బుచ్చి రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఘట్కేసర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ బోడుప్పల్ కార్పొరేటర్లు BRS సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర పరిధిలో పేద, మధ్యతరగతి ముస్లిం మైనారిటీలు అనేక మంది నివాస్తున్నారని వారి కోసం షాది ఖానా, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని.. అదేవిధంగా పండుగలలో సామూహిక ప్రార్ధనల కోసం ఈద్గా, పెరుగుతున్న జనాభా భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఖబ్రస్థాన్ కోసం సుమారు 5 ఎకరాల స్థలం కేటాయించవలసిందిగా ముస్లిం పెద్దలు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సర్వే నెం 181 నందు ఉన్న ముస్లిం ఖబ్రస్థాన్ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికి పనులు మొదలు కాలేదని నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. షాదీ ఖానా, కమ్యూనిటీ హాల్, ఈద్గా, ఖబ్రస్థాన్ నిర్మాణం మొదలైన అభివృద్ధి పనుల కొరకు అనువైన స్థలం గుర్తించి తప్పకుండ కేటాయించి నిర్మాణం చేసేవిధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులను గత ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూతుబ్ షాహి మస్జీద్ ప్రెసిడెంట్ మొహమ్మద్ తాజద్దీన్, కో ఆప్షన్ నాజియా అలీం, మహబూబ్ అలీ, ఖాదర్, జాకీర్, ఖాన్, గౌస్, రజాక్, , హామీద్, అహ్మద్, గులాం తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కిషోర్ పై తప్పుడు ప్రకటనలు చేస్తే ఖబర్దార్

**బీ ఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతయ్య**

**తుంగతుర్తి, విశాల భారతి :** నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కిషోర్ పై బిజెపి నాయకులు తప్పుడు ప్రకటనలు చేస్తే.. ఖబర్దార్ అని తుంగతుర్తి మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మూడవసారి తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా గాదరి కిషోర్ కుమార్ ప్రకటించినందుకుగాను ఒక్కొక్క గ్రామపంచాయతీకి పది లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల హర్షిస్తూ బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తుంగతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం 5400 కోట్లకు పైగా హెచ్చించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందని అన్నారు. దవాఖాన కోసం 40 కోట్ల నిధులు మంజూరు చేయించారని రామన్న రోజుల్లో నూతన బిల్డింగ్ తో సహా, 100 పడకల దవాఖానగా మారనున్నట్లు తెలిపారు. తిరుమలగిరి పైలెట్ ప్రాజెక్టుతో పాటు తుంగతుర్తిలో అత్యధికంగా దళిత బంధు నిధులు మంజూరు చేయించడంతో నాడు కూలీలు నేడు ఓనర్లుగా మారి ఎన్నో కుటుంబాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నట్టు తెలిపారు. కుట్రలు కుతంత్రాలు రానున్న అసెంబ్లీ ఎన్నికలు మూడోసారి హ్యాట్రిక్ విజయం గాదరి కిషోర్ దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, గుండె గాని రాములు గౌడ్, దొంగరి శ్రీను, సర్పంచుల ఫోరం అధ్యక్షులు నల్లు రామచంద్రారెడ్డి కటక వెంకటేశ్వర్లు గోపగాని రమేష్ గౌడ్ గోపగాని శ్రీను పులుసు వెంకటనారాయణ గౌడ్ ముత్యాల వెంకన్న ఎల్లబోయిన బిక్షం గాజుల యాదగిరి ఆకారపు సైదులు మల్లెపాక వెంకన్న చెరుకు పరమేష్ తడకమల రవికుమార్, కిరణ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫొటోకు క్షీరాభిషేకం

**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు జిట్టా మల్లారెడ్డి అన్నారు. భువనగిరి, ఆలేరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్లను అవసరమైతే బీసీలకు కేటాయిస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక బొమ్మాయిపల్లి 11వ వార్డ్ టీచర్స్ కాలనీ లో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఎంపీ వెంకట్ రెడ్డి తెలంగాణా ఉద్యమం లో తన మంత్రి పదవిని కూడా లెక్క చెయ్య కుండా రాజీనామా చేసి చరిత్ర లో నిలిచారని అన్నారు. ఎంపీ గా నిబద్ధత కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకునిగా చేసిన త్యాగాలని తెలంగాణ ప్రజలు ఎప్పుడు మర్చిపోలేరని అన్నారు. నల్లగొండ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు ఎంపీ వెంకట్ రెడ్డిని సీఎంగా చూడాలనుకుంటున్నారని , నల్లగొండ జిల్లాలో వెంకట్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కవిడి వెంకట్ రెడ్డి, మొగలి నర్సి రెడ్డి, దాడిగే జాంగోలు యాదవ్, దాసరి మధు, పార్వతి కృష్ణ, శివ శంకర్ ఎస్కే బాబా, బాను ప్రసాద్, మహేందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# భగవంత్ కేసరి నుంచి హైలీ ఎనర్జిటిక్ గణేష్ సాంగ్



'భగవంత్ కేసరి' మేకర్స్ రెండు రోజుల క్రితం విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ గణేష్ సాంగ్ ప్రోమోతో అలరించారు. పూర్తి లిరికల్ వీడియోను విడుదల చేశారు. మాస్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, శ్రీలీల గణేష్ చతుర్థి సెలబ్రేట్ చేసుకుంటూ బాబాయ్ అమ్మాయిగా సందడి చేశారు. గణేష్ పాట కోసం ఎస్ఎస్ థమన్ పెప్పీ, మాస్ ట్యూన్ కంపోజ్ చేసారు. తెలంగాణ యాసలో ఉన్న ఈ పాట ఆర్కెస్ట్రేషన్ ఆకట్టుకుంది. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం మాస్‌ని కట్టిపడేసింది. కరేముల్లా, మనీషా పాండ్రంకి ఈ పాటను హైపిచ్ద్ వోకల్స్ తో ఎనర్జిటిక్ గా అలపించారు. బాలకృష్ణ, శ్రీలీల తమ క్రేజీ డ్యాన్స్‌తో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. వారి కాస్ట్యూమ్ లు, గెటప్ లు, డ్యాన్స్‌లు అన్నీ పాటకు పర్ఫెక్ట్‌గా అనిపించాయి. విజువల్స్ అద్భుతంగా వున్నాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ బ్రిలియంట్ గా వుంది. పోస్టర్లు, ప్రోమోలు సెట్ చేసిన అంచనాలను ఈ పాట అందుకుంది. దర్శకుడు అనిల్ రావిపూడి పాటల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. షైన్ స్క్రీన్స్ ప్రొడక్షన్ మ్యూజికల్ జర్నీని చార్ట్‌బస్టర్ నోట్‌లో ప్రారంభించింది.

# సెప్టెంబర్ 5న 'టైగర్ నాగేశ్వరరావు' ఫస్ట్ సింగిల్

టైగర్ నాగేశ్వరరావు సూపర్ ఎంటర్‌టైనింగ్, ఎనర్జిటిక్ అవతార్ ని పెప్పీ నంబర్ లో చూడటానికి సిద్ధంగా ఉండండి. మాస్ మహారాజా రవితేజ నటించిన ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ప్రమోషన్‌లు మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఫస్ట్ సింగిల్ ఏక్ దమ్ ఏక్ దమ్ సెప్టెంబర్ 5న విడుదల కానుంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ, నూపూర్ సనన్ రెట్రో అవతార్‌లలో కనిపించడం ఆకట్టుకుంది. నుపుర్ తన చేతుల్లో పుస్తకాలు పట్టుకుని కాలేజీ విద్యార్థినిగా కనిపిస్తుంది. రవితేజ ఆమెను ఆటపట్టించడం, బ్యాక్‌గ్రౌండ్‌లో డాన్సర్‌లను కూడా గమనించవచ్చు. జివి ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కి వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. టైగర్ దండయాత్ర గ్లింప్స్ కి అద్భుతమైన స్పందన లభించింది. వరుసగా పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్ ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2 చిత్రాలను రూపొందించిన అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ గ్రాండ్‌గా నిర్మిస్తున్న ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్ మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. రవితేజ కెరీర్ లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కించిన చిత్రం టైగర్ నాగేశ్వరరావు'. కథకు యూనివర్సల్ అప్పీల్ ఉన్నందున మేకర్స్ దీనిని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు.



# పవర్ స్టార్ పవన్ కల్యాణ్ న్యూ మూవీ



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా స్టయిలీష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్నారు. ఈ రోజు ఈ చిత్రం ఆఫీస్ ఓపెనింగ్ జరిగింది. త్వరలోనే సినిమా షూటింగ్ ప్రారంభం కాబోతుంది. ఈ చిత్రానికి సక్సెస్ ఫుల్ రైటర్ వక్కంతం వంశీ కథ అందిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కోసం ఓ పవర్ ఫుల్ స్టొరీని రెడీ చేశారు వక్కంతం వంశీ. చిత్ర యూనిట్ త్వరలోనే సినిమాకి సంబధించిన పూర్తి వివరాలు తెలియజేయనుంది.



# ఖుషి మూవీని సకుటుంబంగా ఎంజాయ్ చేస్తున్నారు

**సక్సెస్ మీట్ లో మూవీ టీమ్**

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన ఖుషి సినిమా ఇవాళ ప్రేక్షకుల ముందుకొచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై దర్శకుడు శివ నిర్వాణ రూపొందించారు. లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల ప్రేమను ఏకగ్రీవంగా పొందుతున్న ఖుషి సక్సెస్ మీట్ ను చిత్ర నిర్మాణ సంస్థ ఆఫీస్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ - ఖుషి సినిమాను ప్రేక్షకులు యూనానమస్ గా సూపర్ హిట్ చేశారు. ఎర్లీ మార్నింగ్ నుంచి యూఎస్ కాల్స్ వస్తున్నాయి. డిస్ట్రిబ్యూటర్స్ కంటిన్యూస్ గా కాల్స్ చేస్తున్నారు. షో బై షో కలెక్షన్స్ పెరుగుతున్నాయని రిపోర్ట్ ఇస్తున్నారు. ఖుషి ఇంకా ఎంత పెద్ద రేంజ్ కు వెళ్లుందో మరికొద్ది రోజుల్లో చెబుతాం. వెరీ క్లీన్ మూవీ ఇది. ఈ మధ్య కాలంలో ఇలాంటి సినిమా రాలేదు. మంచి మూవీ కాబట్టి అవార్డ్స్ కు కూడా అవకాశం ఉంది. మా సంస్థకు ఇంత మంచి సూపర్ హిట్ ఇచ్చినందుకు శివ గారికి థాంక్స్. అలాగే విజయ్, సమంత, మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ ఇతర టీమ్ అందరికీ థ్యాంక్స్. అన్నారు. నిర్మాత వై రవి శంకర్ మాట్లాడుతూ - మేము ఖుషి కథ విన్నప్పుడు ఎలాంటి నమ్మకం పెట్టుకున్నామో..ఆ నమ్మకాన్ని నిజం చేసేలా రిజల్ట్ వచ్చింది. బాక్సాఫీస్ నెంబర్స్ షో బై షో పెరుగుతూ ఉన్నాయి.. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కాబట్టి ఖుషికి థియేటర్స్ లో లాంగ్ రన్ ఉంటుంది. సినిమా విడుదలైన ప్రతి చోట నుంచి ఎక్స్ ట్రార్డినరీ రిపోర్ట్ వస్తోంది. విజయ్ సూపర్బ్ పర్మార్మెన్స్ చేశాడు. అలాగే సమంత నటన ఎంతో బాగుంది. హేషమ్ మ్యూజిక్ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రతి హీరో సినిమాకు మనం చేసే ప్రమోషనల్ కంటెంట్ చూసి ప్రేక్షకులు ఒక అంచనాకు వస్తారు. సినిమా ఇలా ఉంటుందేమో అనుకుంటారు. అందుకే ప్రతి సినిమాకు ఫస్ట్ షో వరకు దాని కరెక్ట్ రిజల్ట్ వస్తుంది. మా మూవీకి ఓవరాల్ పాజిటివ్ రెస్పాన్స్ ఉంది. అందరికీ నచ్చే సినిమా చేసిన మా దర్శకుడు శివ గారికి థాంక్స్ చెబుతున్నాం.అన్నారు.

# సూపర్ గ్లామర్




సూపర్ సెక్సీ హీరోయిన్ కరీనా కపూర్ ను చూస్తే గ్లామర్ రూల్స్ అన్నింటిని కచ్చితంగా తిరగరాయాల్సిందే. సాధారణంగా పెళ్లయిన తర్వాత హీరోయిన్లు ఫేడవుట్ అయిపోతారు. గ్లామర్ కంటెంట్ పై ఇంట్రస్ట్ తగ్గిపోవడంతో నెమ్మదిగా ఇండస్ట్రీకి దూరమవుతారు. కానీ బెబో తీరు మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. పెళ్లి చేసుకుని.. పిల్లలు పుట్టాక అదే ఛరిష్మాతో కొనసాగుతుంది. కరీనా లా ఐశ్వర్యారాయ్ కూడా రంగుల ప్రపంచలో కొనసాగాలని ట్రై చేసింది కానీ పనవ్వలేదు. ఇది కరీనాకి మాత్రమే సొంతమైందని ఎన్నో సందర్భాల్లో రుజువు చేసింది. తాజాగా కరీనా హాట్ పంచ్ కి ఎవరైనా గిల గిలా కొట్టుకోవాల్సిందేనని! ఓ కొత్త ఫోటోతో ఇలా ముందుకొచ్చేసింది. ఇదిగో అమ్మడు ఇలా ఎద అందాల ఆరబోతతో కాకలు పుట్టిస్తుంది. షోల్డర్ లెస్ బ్లాక్ డిజైన్ లో ఎద అందాల ఎలివేషన్ తో సెగులు రేపుతుంది. 40 ప్లస్ లోనూ కరీనా 25 బ్యూటీలా నెట్టింట దుమారం రేపుతుంది. జీరో సైజ్ నుంచి కాస్త ఒళ్లు చేసినట్లు కనిపిస్తుంది. అమ్మడి మెడలో చైన్.. చైన్ కి ఉన్న లవ్ సింబల్ బిళ్ల సరిగ్గా సెటర్ ఆఫ్ ది అట్రాక్షన్ అయింది. మిల మిల మెరిసిపోతున్న సౌందర్యంపై ఆ బిళ్ల అమ్మడి అందాలకు మరింత వన్నె తీసుకొ చ్చింది. అలాగే తనదైన శైలి కరీనా నలుపు చూపులు అంతే హైలైట్. కరీనా అంటే కళ్లే అందం. ఆ కళ్లకి నల్లటి కాటుక అద్దింది! అంటే ఆ అందం పీక్స్ లో ఉంటుంది. గోల్డ్ కలర్ హెయిర్ స్టైల్ ప్రతీది అమ్మడిని మరింత అందంగా ఫోకస్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. కరీనా అభిమానులు తమదైన శైలిలో కామెంట్లతో మరింత అభిమానం కురిపిస్తున్నారు. కరీనా సినిమాల సంగతి చూస్తే ఇటీవలే 'జానే జాన్' షూటింగ్ పూర్తిచేసింది. ఇదే నెలలో సినిమా రిలీజ్ అవుతుంది. అలాగే 'ద బకింగ్ హమ్ మర్డర్స్' షూటింగ్ కూడా పూర్తయింది. ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. 'దిక్రూ' మాత్రం ఆన్ సెట్స్ లో ఉంది.

# 'జీబ్రా' డబ్బింగ్ ప్రారంభం



టాలెంటెడ్ హీరో సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ కథానాయకులుగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జీబ్రా. లక్ ఫేవర్స్ ది బ్రేవ్.. అన్నది ట్యాగ్ లైన్. పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ పతాకాలపై ఎస్ఎన్ రెడ్డి, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్, జెన్నిఫర్ పిసినాటో హీరోయిన్లుగా నటిస్తుండగా, ప్రముఖ నటుడు సత్యరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా హీరో సత్యదేవ్ 'జీబ్రా' డబ్బింగ్ మొదలుపెట్టారు. ఈ సందర్భంగా స్టూడియో నుంచి డబ్బింగ్ చెబుతున్న ఫోటోలని అభిమానులతో పంచుకున్నారు. ఇదివరకు ఎన్నడూ చూడని ఆర్థికనేరాల నేపథ్యంలో యధార్ధ సంఘునట స్ఫూర్తితో ఈ చిత్రం రూపొందుతోంది.

# మార్చిలో ఘన్నుభాయ్



అద్భుతమైన ప్రాజెక్ట్‌లని నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అభిషేక్ పిక్చర్స్ అభిషేక్ నామా, వెరీ ట్యాలెంటెడ్ ఆదిత్య గంగసానిని హీరోగా పరిచయం చేస్తూ కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేశారు. ప్రణయ్ మైకల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుంది. దేవాన్ష్ నామా సమర్పిస్తున్న ఈ చిత్రానికి 'ఘన్ను భాయ్' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. మేకర్స్ ఈ రోజు సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ మాస్ అవతార్‌లో ఆదిత్య గంగసానిని ప్రజెంట్ చేస్తోంది. ఆదిత్య డ్రమ్స్ కొడుతూ కనిపించి ఫుల్ ఎనర్జీతో వున్నారు. 'ఇస్మార్ట్ కా బాప్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. ఫస్ట్ లుక్ పోస్టర్ కలర్ ఫుల్ గా ఆకట్టుకొని మంచి ఇంప్రెషన్ కలిగించింది. ఈ చిత్రానికి యంగ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. అభే సంగీతం అందించగా, గోకుల్ భారతి కెమెరామెన్ గా పని చేస్తున్నారు. ఎడిటర్‌గా అమర్‌రెడ్డి కుడుముల, ప్రొడక్షన్ డిజైనర్‌గా గాంధీ నడికుడికార్ పని చేస్తున్నారు.మ మోహిత్ రౌలియాని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కాగా, వాసు పోతిని సీఈఓ. 8 మార్చి 2024న ఈ సినిమా విడుదల కానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.